నేటి నిజం

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 31-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 24 | పేజీలు:4 | వెల: రూ.1/-

ఇండియా మాకు ముఖ్యమైన దేశం.. వారికి ఎలాంటి ముప్పు ఉండదు : తాలిబన్లు

కాబూల్, ఆగష్టు 30: ఇండియా మాకు ముఖ్యమైన దేశం.. ఆఫ్ఘనిస్థాన్ నుంచి వారికి ఎలాంటి ముప్పు ఉండదని తాలిబన్ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ప్రకటిం చారు. భారతదేశంతో ఆఫ్ఘనిస్థాన్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. తమ పాలనలో కూడా భారత్‌తో మంచి సంబంధాలు కొనసాగించాలని ఆశిస్తున్నాను అని తెలిపారు.

భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌తో ఆఫ్ఘనిస్థాన్ చేతులు కలుపుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయని జబీహుల్లాను రిపోర్టర్ ప్రశ్నించగా.. ఆ వార్తలు నిరాధారమైనవి అని కొట్టిపారేశారు. తాము భారతదేశానికే కాదు ఏ దేశానికి కూడా హానీ కలిగించము. తమ వైపు నుంచి ఇండియాకు ఎలాంటి ముప్పు ఉండదు అని హామీ ఇస్తున్నట్లు జబీహుల్లా స్పష్టం చేశారు.

ఆగస్టు 26న జబీహుల్లా ఓ ఇంట ర్వ్యూలో మాట్లాడుతూ.. పాకిస్థాన్‌ను తమ రెండో హోమ్‌గా తాలిబన్లు చూస్తున్నారని పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో ఆఫ్ఘన్ సరిహద్దులు పంచుకుంటున్నాయి. మతం విషయానికి వస్తే మేము సంప్రదాయబద్ధంగా ఉంటాము. రెండు దేశాల ప్రజలు ఒకరితో ఒకరు కలిసిపోతారు. కాబట్టి పాకిస్తాన్‌తో సంబంధాలు మరింత బలపడటం కోసం మేము ఎదురుచూస్తున్నాము అని జబీహుల్లా ముజాహిద్ తెలిపారు.ఇతర దేశాల రాయబార కార్యాలయాలు ఆఫ్ఘనిస్థాన్‌లో ఉండాలని తాలిబన్లు కోరుకుంటున్నట్టు ముజాహిద్ చెప్పారు. అన్ని దేశాలు తమ దేశంతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇతర దేశాల రాయబారులకు భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు

ఉత్పత్తి పెరిగింది.. కానీ ఉత్పాదకత, ఆదాయం పెరగాలి : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , ఆగష్టు 30:రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరిగింది. కానీ ఉత్పాదకత, ఆదాయం కూడా పెరగాల్సిన అవసరం ఉందని ఐటీ, మున్సిపల్ శాఖ కేటీఆర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవి ద్యాల యంలో ఏర్పాటు చేసిన అగ్రి హబ్‌ను మంత్రులు నిరంజన్ రెడ్డి, కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డికలిసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి కేటీఆర్ ప్రసంగించారు.

సీఎం కేసీఆర్ సూచనలు, మార్గదర్శకత్వంలో మంత్రి నిరంజన్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని అద్భుతంగా ముందుకు తీసుకుపోతున్నారు. సీఎం కేసీఆర్‌కు వ్యవసాయం పట్ల ప్రేమ, సాగునీటి రంగంపై ఉన్న శ్రద్ధతో ఈ ఏడేండ్లలో తెలంగాణ వ్యవసాయ, సాగునీటి రంగంలో ఏ రాష్ట్రం సాధించని అద్వితీయమైన విజయాలను సాధించింది. ప్రపంచం అబ్బురపడే విధంగా మూడున్నరేండ్ల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కృష్ణా, గోదావరి జీవనదుల్లోని ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి.. సాగుకు యోగ్యమైన భూమికి నీరందించేందుకు కృషి చేస్తున్నారు. పాలమూరు ఎత్తిపోతల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏడేండ్లలో ధాన్యం దిగుబడి పెరిగింది. ఇవాళ తెలంగాణ ధాన్య భాండాగారంగా మారిందన్నారు. రైతులకు అండగా ఉంటున్నాం. ఒకప్పుడు మనదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో ఆహార భద్రత ఒక సవాల్‌గా ఉండేది. ఈ జనాభాకు సరిపడా ఆహారం ఉత్పత్తి చేయగలుగుతామా? అనే సందేహం ఉండేది. ఇప్పుడు ఆహార భద్రతను సాధించాం. కానీ ప్రస్తుతం పోషాకాహార భద్రత ఒక సవాల్‌గా మారింది. కొవిడ్ వ్యాపించిన తర్వాత ప్రజలందరూ న్యూట్రిషన్ ఫుడ్‌పై మక్కువ చూపుతున్నారు అని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రొడక్షన్, ప్రొడక్టివిటీ, ప్రాఫిటబిలిటీ అనేది రైతుకు చాలా ప్రాముఖ్యమైన విషయం. దేశంలో 55 నుంచి 60 శాతం మంది జనాభా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులను తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. సబ్సిడీ మీద నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నాం. వడ్డీ లేని రుణాలు ఇస్తున్నాం. రైతుబంధు రూపంలో ఎకరానికి రూ. 5 వేల చొప్పున రెండు పంటలకు రూ. 10 వేలు ఇస్తున్నాం. ప్రతి రైతుకు జీవిత బీమా చేసి రైతు కుటుంబంలో ధీమా నింపుతున్నాం. ధాన్యం సేకరణలో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. గోడౌన్ల సామర్థ్యం 4 లక్షల నుంచి 26 లక్షల టన్నులకు పెరిగింది. పాలిహౌస్, మెక్రో ఇరిగేషన్‌కు సబ్సిడీ ఇస్తున్నాం.

నినాదాలు అలానే మిగిలిపోతున్నాయి

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కొన్ని లక్ష్యాలు, నినాదాలు అలానే మిగిలిపోతున్నాయి. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు 2022 కల్లా రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని నినాదం ఇచ్చారు. ఇది ఆచరణలో సఫలమైందా? ఒరిగిందా? అంటే కాలేదనే చెప్పొచ్చు. కొంత వరకు మాత్రమే జరిగింది.

ఇన్నోవేషన్ ఎవరి సొత్తు కాదు..

రైతును మించిన ఇన్నోవేటర్ లేడు. ఇన్నోవేషన్ ఎవరి సొత్తు కాదు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయులు మొదటి స్థానంలో ఉన్నారు. అగ్రిహబ్‌లో తెలుగు భాషకు పెద్దపీట వేయాలి. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి. 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్‌ను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తెలంగాణలో వ్యవసాయ రంగంపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు

సెప్టెంబర్ 1న ఢిల్లీకి సీఎం కేసీఆర్..

హైదరాబాద్ , ఆగష్టు 30:తెలంగాణ సీఎం కేసీఆర్ మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఢిల్లీలో పార్టీ కార్యాలయాన్ని నిర్మించి.. జాతీయ రాజకీయాలపై ఫోకస్ పెట్టాలని ఎప్పటి నుంచో భావిస్తున్న గులాబీ పార్టీ అధినేత.. హస్తినలో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి భూమిపూజ చేయనున్నారు.. ఇక, ఈ మూడు రోజుల పర్యటనలో రెండు రోజుల పాటు ఢిల్లీలోనే బస చేయనున్నారు. ఈ సందర్భంగా పలువురు కేంద్రమంత్రులను కలిసే అవకాశం ఉందనే చర్చ కూడా నడుస్తోంది. ఇక సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయల్దేరనున్న ఆయన.. సెప్టెంబర్ 2న మధ్యాహ్నం 12:30 గంటల నుంచి ఢిల్లీలో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి భూమిపూజ చేస్తారు.. సీఎం కేసీఆర్ తో పాటు ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ నాయకులు పాల్గొంటారు.. ఢిల్లీలోని వసంత్ విహార్ మెట్రో స్టేషన్ పక్కన టీఆర్ఎస్ పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం 1300 గజాల స్థలాన్ని కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.. అక్కడే నిర్మాణం చేపట్టనున్నారు.. ఇక, సెప్టెంబర్ 3న మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్‌కు రానున్నారు కేసీఆర్.

దేశంలో అలజడికి భారత వ్యతిరేక శక్తుల కుట్ర : రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 30: దేశానికి స్వాతంత్ర్యం లభించినప్పటి నుంచి దేశంలో అస్థిరత సృష్టించేందుకు భారత వ్యతిరేక శక్తులు పనిచేస్తున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌పై విరుచుకుపడ్డారు. భారత్‌లో అలజడి రేపేందుకు పాకిస్తాన్ భూభాగం నుంచి ప్రయత్నాలు సాగుతున్నాయని ఓ వార్తసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. సరిహద్దుల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని పేర్కొంటూ భారత్ పొరుగు దేశం చర్యల పట్ల వేచిచూసే ధోరణి అవలంభిస్తోందని అన్నారు.

ఆర్టికల్ 370, 35ఏ రద్దుతో జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదం సమసిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గల్వాన్ లోయ ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా అమర జవాన్ల సేవలను మంత్రి కొనియాడారు. భారత సైన్యం చూపిన సంయమనం, అసమాన ధైర్యసాహసాలు రాబోయే తరాలకూ గర్వకారణమని అన్నారు. లడఖ్, ఈశాన్య రాష్ట్రాల్లో పలు మౌలిక వసతుల ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని, ఇవి మౌలిక ప్రాజెక్టులే కాకుండా జాతీయ సెక్యూరిటీ గ్రిడ్‌లో కీలక భాగమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు : హోం మంత్రి మహముద్ అలీ

హైదరాబాద్ , ఆగష్టు 30: వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని హోం మంత్రి మహముద్ అలీ పేర్కొన్నారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై సోమవారం మహముద్ అలీ సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశానికి వక్ఫ్ బోర్డు చైర్మన్ సలీం, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, వక్ఫ్ బోర్డు సీఈవో షావానాజ్ ఖాసింతో పాటు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, అనధికార ఆక్రమణల తొలగింపు కోసం సకాలంలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులపై తాజా సమాచారాన్ని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షానవాజ్ ఖాసిం అందించారు. వక్ఫ్ బోర్డు బాగా పనిచేస్తోందని, సిబ్బంది తక్కువగా ఉన్నారని, ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఖాసిం పేర్కొన్నారు.

ఫైజర్ వ్యాక్సిన్‌తో తొలి మరణం..!

హైదరాబాద్ , ఆగష్టు 30:కరోనా మహమ్మారిపైని ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రకాల వ్యాక్సిన్లు వచ్చాయి. అయితే అయితే, అక్కడక్కడ వ్యాక్సిన్లు వికటించిన మృతిచెందినట్టు వార్తలు వస్తూనే ఉన్నాయి.. తాజాగా, న్యూజిలాండ్‌లో ఓ మహిళ మృతిచెందారు..

ఫైజర్ వ్యాక్సిన్ తీసుకున్న ఓ మహిళ చనిపోయినట్లు న్యూజిలాండ్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది.. ఫైజర్ వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత అత్యంత అరుదైన మయోకార్డిటిస్ అంటే గుండె కండరాల్లో ఇన్‌ఫ్లేమేషన్‌తో ఆ మహిళ చనిపోయినట్టు భావిస్తున్నామని.. ఫైజర్ వ్యాక్సిన్ వల్ల దేశంలో సంభవించిన తొలి మరణం ఇదేనని ప్రకటించింది న్యూజిలాండ్. ఇక, ఆ మహిళ ఇప్పటికే పలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని కూడా తెలిపింది. మరోవైపు.. ఫైజర్ వ్యాక్సిన్ వల్ల కలిగే అనర్థాల కంటే ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని కూడా వెల్లడించింది.

14 కిలోల గంజాయిని పట్టుకున్న మిర్యాలగూడ పోలీసులు

హైదరాబాద్ , ఆగష్టు 30:అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు సభ్యులను మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద రూ.లక్షా 40 వేల విలువైన 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఈ మేరకు నిందితుల వివరాలను ఆయన సోమ వారం మీడియాకు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు గంజాయి రవాణా, విక్రయాలపై పటిష్ట నిఘా పెట్టినట్లు డీఎస్పీ చెప్పారు.

నార్కట్ పల్లి అద్దంకి హైవేలో మిర్యాలగూడ రూరల్ సర్కిల్ పరిధిలోని గూడూరు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టామననారు. బైక్‌పై అనుమానా స్పదంగా వెళ్తున్న వ్యక్తులను తనిఖీ చేయాగా వారి వద్ద నుంచి 14 కిలోల గంజాయి లభించిందన్నారు. మూడు సెల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన చల్లా రాహుల్ రెడ్డి, పోచమల్ల సురేష్, జాస్తి జీవన్ కుమార్ గంజాయి రవాణా చేస్తున్న ట్లుగా ఒప్పుకున్నారని డీఎస్పీ చెప్పారు.వీరు ముగ్గురు గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం సమీపంలోని సారపాక ప్రాంతంలో ఓ వ్యక్తి నుంచి కొను గోలు చేసి హైదరాబాద్ లో విక్రయించేం దుకు వెళ్తున్నట్లుగా విచారణలో తెలిసింద న్నారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

టీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి : ఎమ్మెల్యే అరూరి

జమ్మికుంట రూరల్, ఆగష్టు 30:: తెలంగాణలో టీఆర్ ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే హుజురాబాద్‌లో పార్టీని గెలిపిస్తాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే, జమ్మికుంట రూరల్ ఇన్‌చార్జ్ ఆరూరి రమేష్ అన్నారు. సోమవారం హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట, వెంకటేశ్వరపల్లి, పాపయ్యపల్లి, విలాసాగర్, సైదాబాద్ గ్రామాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకుల సమావేశం వెంకటేశ్వర గార్డెన్స్ లో నిర్వహించారు.

ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని,. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని నాయకులకు సూచించారు.కులాల వారిగా సమావేశం నిర్వహించి, మహిళల తో బొట్టు కార్యక్రమం చేపట్టి, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ఆయన సొంత అభివృద్ధి కోసం తప్ప నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏనాడూ పని చేయలేదని విమర్శించారు. హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రతిపక్షాల కళ్ళబొల్లి కబుర్లు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఎవరు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా హుజురాబాద్ లో ఎగిరేది గులాబీ జెండా మాత్రమేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, రావుల శ్రీధర్ రెడ్డి, జడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్, ఎంపీపీ దొడ్డే మమత, ఇంచార్జ్ లు, సర్పంచులు, ఎంపీటీసీలు, క్లస్టర్ ఇంచార్జిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌కు మంత్రి హరీశ్‌రావు చురకలు

జమ్మికుంట, ఆగష్టు 30:: మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు ఆర్థిక మంత్రి హరీశ్‌రావు చురకలంటించారు. ఎన్నికల్లో మద్యం, డబ్బులు పంచాల్సి వస్తే రాజకీయాల నుండి తప్పుకుంటానని ఈటల చెప్పారు.

కానీ ఈటల రాజేందర్ ఆ ప్రతిపాదనను మరిచి మద్యం, డబ్బు, మిషన్లు, గడియారాలు, కుంకుమ భరణిలు పంచుతున్నారు.

మాటకు కట్టుబడని వ్యక్తి రాజేందర్ అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్‌లో మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ సమక్షంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 500 మంది యువత గులాబీ గూటికి చేరారు. వీరందరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈటల రాజేందర్ టీఆర్ఎస్ పార్టీలో చేరకముందే ఈ ప్రాంతం గులాబీ మయం అయిందన్నారు. టీఆర్ఎస్ పార్టీ తరపున ఈటల గెలిచినప్పటి నుంచి ఆయన వెంట తామంతా ఉన్నామని తెలిపారు. ఈటల టీఆర్ఎస్‌ను వీడినా కూడా ఆయన వెంట ఎవరూ వెళ్లలేదు. టీఆర్ఎస్‌లోకి ఒక్కడే వచ్చిండు.. ఒక్కడే వెళ్లిండు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. గెల్లు శ్రీనివాస్ గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది. కానీ ఈటల గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతాదా? హరీశ్ రావు అని ప్రశ్నించారు. 2014లో సిలిండర్‌కు దండం పెట్టు.. బీజేపీకి ఓటు వేయమని చెప్పారు. ఇప్పుడు సిలిండర్ ధరను తలుచుకొని టీఆర్ఎస్‌కు ఓటు వేయాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు.

బెంగాల్‌లో కాషాయ పార్టీకి షాక్ : టీఎంసీలో చేరిన బీజేపీ ఎమ్మెల్యే

కోల్‌కతా, ఆగష్టు 30: : పశ్చిమ బెంగాల్‌లో కాషాయ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. విష్ణుపూర్ బీజేపీ ఎమ్మెల్యే తన్మయ్ ఘోష్ ఆ పార్టీని వీడి సోమవారం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో చేరారు. బీజేపీ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. బెంగాల్ ప్రజల్లో అలజడికి కారణమవుతున్నందునే తాను కాషాయ పార్టీని వీడి తృణమూల్ కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నానని అన్నారు. బెంగాల్ అభివృద్ధికి, సంక్షేమానికి అందరూ తృణమూల్ కాంగ్రెస్‌లో చేరాలని ఘోష్ పిలుపు ఇచ్చారు.కాగా తన్మయ్ ఘోష్ బెంగాల్ ఎన్నికలకు ముందు ఈ ఏడాది మార్చిలో టీఎంసీ నుంచి బీజేపీలో చేరారు. అంతకుముందు బంకుర జిల్లా విష్ణుపూర్ టీఎంసీ యూత్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఘోష్ టీఎంసీలో చేరడం సంతోషకరమని విద్యాశాఖ మంత్రి బ్రత్య బసు స్వాగతించారు. పలువురు బీజేపీ నేతలు టీఎంసీలో చేరేందుకు తమతో టచ్‌లో ఉన్నారని చెప్పారు.

టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

కామారెడ్డి, ఆగష్టు 30:: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. జిల్లాలోని నసురుల్లాబాద్ మండలం అంకోల్ తండాకు చెంది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తండా సర్పంచ్ భద్యనాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బాబు గుగులోత్, బోడ రాము, ధూప సింగ్ బానోత్, పెర్మల్ బానోత్, పాల్త్య భీమా, చంగ్య, పాల్త్య ధూప సింగ్, కె.మంగత్య, కాంగ్రెస్ పార్టీకి చెందిన 180 కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు.వారికి బాన్సువాడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో భాస్కర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటా : విప్ గాంధీ

హైదరాబాద్ , ఆగష్టు 30: పేదరికంతో ఏ విద్యార్థి చదువుకు దూరం కాకుడన్నదే తన తపనని అలాంటి పేద విద్యార్థులకు తాను పెద్దన్నలా అండగా నిలిచి వారి కలలను పూర్తి చేసుకునేందుకు సహకరిస్తానని ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ అన్నారు. తన నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే ఎందరో పేద విద్యార్థుల చదువుకు తోచిన సహాయాన్ని అందిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకునేందుకు దోహదపడుతున్నట్లు వెల్లడించారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బి బ్లాక్‌కు చెందిన నిరుపేద విద్యార్థి సుమంత్ కు ఇంజనీరింగ్ విద్యకు కళశాల ఫీజు నిమిత్తం రూ.1,25,600 మొత్తాన్ని చెక్కు రూపంలో విప్ గాంధీ సోమవారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా విప్ గాంధీ మాట్లాడుతూ ఆకస్మికంగా కుటుంబ పెద్ద పోవటంతో ఇద్దరు అమ్మాయిలను దత్తత తీసుకుని చదివిస్తున్నట్లు , వారితో పాటు వారి కుమారుడికి ఫీజు చెల్లిస్తున్నా నన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అందుకోవాలని, భవిష్యత్‌లో తోచిన మేర పేదలకు అండగా నిలవాలని విప్ పిలుపునిచ్చారు. తన పరిధిలో పేద విద్యార్థులెవరినీ ఆర్థిక సమస్యతో చదువుకు దూరం కానివ్వబోనని ఆయన హామీ ఇచ్చారు. కాగా తన చదువుకు ఫీజు రూపంలో ఆర్థిక సాయం అందించిన విప్ గాంధీకి పేద విద్యార్థి సుమంత్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి : సీఎస్ సోమేశ్‌కుమార్

హైదరాబాద్ , ఆగష్టు 30: సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లతో బీఆర్‌కేఆర్ భవన్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వాతావరణ శాఖ జారీ చేసిన సూచనలు మేరకు రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్లు, అధికారులను సీఎస్ ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. నీటి పారుదల , విద్యుత్ శాఖ అధికారులు జాగ్రత్తగా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

క్షేత్రస్థాయి అధికారులు , ఉద్యోగులు హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడానికి అధికారులందరితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. వీసీలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్, ఫైర్ సర్వీసెస్ డీజీ సంజయ్ కుమార్ జైన్, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రిజ్వీ, సీఎంఓ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీ రోనాల్డ్ రోస్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, సీడీఎంఏ సత్యనారాయణ, ఎన్‌డీఆర్ఎఫ్ దామోదర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం



(ఆగష్టు 31 చిత్రకారుడు, దర్శకుడు 'బాపు' వర్ధంతి..) -రాధశ్రీ

సెల్: 9494481210

అమెరికాలో అగ్రభాగాన భారతీయ మేధో సంపత్తి

(అమెరికా జనగణన బ్యూరో-2020 నివేదిక ఆధారంగా)

గత దశాబ్దంలో (2010-20) అమెరికా మైనారిటీ సమూహాల్లో అత్యధికంగా ఏసియన్ల జనాభా 24 మిలియన్లకు పెరిగిందని, అందులో భారతీయ అమెరిన్లే అధిక ప్రాధాన్యతలను పొందారని, అమెరికా జనగణన నివేదిక-2020 తెలియజేసింది. 2010-20 మధ్య కాలంలో అమెరికాలో జనాభా పెరుగుదల మైనారిటీల వల్ల మాత్రమే జరిగిందని తెలుస్తున్నది. 1776లో అమెరికా ఏర్పడిన తరువాత తొలిసారి అమెరికన్ వైట్ జనాభా తగ్గుదలను చూపుతున్నదని వివరించింది. 2000 జన గణన ప్రకారం 69 శాతంగా నమోదైన నాన్-హిస్పానిక్ (స్పెయిన్ జాతి) వైట్స్ జనాభా 2010లో 63.7 శాతం నుంచి 2020లో 58 శాతానికి పడిపోవడం గమనించబడింది. అమెరికాలో 20 మిలియన్ల ఏసియన్లు ఉండగా, 4 మిలియన్ల ఏసియన్లు ఇతర జాతికి చెందిన వారితో వివాహాలు చేసుకున్నారని, యుయస్ జనాభాలో 7.2 శాతం ఏసియన్లు ఉన్నట్లు తెలుస్తున్నది. గత దశాబ్దకాలంలో ఏసియన్ల జనాభా 35.5 శాతం పెరగటం గమనించారు. 2010 జన గణన ప్రకారం అమెరికాలో 17.3 మిలియన్ల ఏసియన్లు ఉన్నారు. నేడు అమెరికా జనాభాలో బహుళ జాతి సంతతి పెరుగుతోంది. గత దశాబ్దంలో అమెరికా జనాభా 7.4 శాతానికి పెరిగి 33.1 కోట్లకు చేరడం గమనించారు. 1930 తరువాత అమెరికన్ జనాభా పెరుగుదల రేటు 2010-20 మధ్యలో మాత్రమే నమోదైంది.

2020 జన గణన ప్రకారం అతి పెద్ద అమెరికన్ కౌంటీగా 10 మిలియన్ల జనాభాతో లాస్ ఏంజలిస్, అతి పెద్ద సిటీగా 8.8 మిలియన్లతో న్యూయార్క్ నిలిచాయి. అమెరికాలోని 384 మెట్రో ఏరియాల్లోంచి 312 మెట్రోల్లో జనాభావృద్ధి నమోదు అయ్యింది. వీటిలో అధిక జనాభా ఉన్న 'ది విలేజెస్-ఫ్లోరిడా'లో 1.3 లక్షల జనాభా నివసిస్తున్నది. 2010-20 మధ్య 72 మెట్రో ఏరియాల్లో జనాభా తగ్గడం గమనించారు. గత దశాబ్దంలో వైట్స్ జనాభా 8.6 శాతం తగ్గుతూ 20.4 కోట్లుగా నమోదైంది. వైట్ లేదా ఇతర జాతికి చెందిన వారితో వివాహాలు చేసుకున్న వారుగా 23.54 కోట్ల శ్వేతజాతీయుల జనాభా ఉన్నది. 2010లో బహుళజాతి జనాభా 9 మిలియన్లు ఉండగా, 2020 నాటికి 33.8 మిలియన్లకు పెరగడం విశేషం. ఏసియన్ సంతతికి చెంది జనాభా 24 మిలియన్లుగా నమోదు అయ్యింది. 2020 నాటికి హిస్పానిక్ (స్పేయిన్) జాతి జనాభా 62.1 మిలియన్లకు చేరింది. గత దశాబ్దకాలంలో 18 ఏండ్లు వయస్సు దాటిన జనాభా 10.1 శాతం (25.83 కోట్లు) పెరిగి, వయోజనుల జనాభా 77.9 శాతానికి చేరింది. గత దశాబ్దం కాలంలో కుటుంబాల సంఖ్యలో 6.7 శాతం వృద్ధితో 14 కోట్లకు చేరడం గమనించారు.

భారతీయ అమెరికన్స్ ఘనత :

యుయస్‌లో నేడు దాదాపు 40 లక్షల భారతీయ అమెరికన్లు ఉండగా, వీరిలో 16 లక్షలు వీసాలు ఉన్నవారు, 14 లక్షలు నివాస హోదా కలిగిన వారు, 10 లక్షలు అమెరికాలో జన్మించిన వారు ఉన్నారు. అమెరికా కుటుంబ జాతీయ సగటు ఆదాయం 63,922 డాలర్లు ఉండగా, భారతీయ కుటుంబాల సగటు ఆదాయం 1.24 లక్షల డాలర్లుగా నమోదు కావడం మనకు గర్వకారణం. ఏసియన్ అమెరికన్లలో తరువాత స్థానం 97,129 డాలర్లతో తైవాన్, 95,000 డాలర్ల సగటు ఆదాయంతో ఫిలిప్పీన్స్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అమెరికన్లతో పోల్చితే భారతీయ అమెరికన్లు ఉన్నత చదువుల్లో, సంపాదనలో కూడా ముందుండడం సంతోషదాయకం. అమెరికన్ గ్రాడ్యుయేట్ల సగటు 34 శాతం ఉండగా, భారతీయ అమెరికన్ గ్రాడ్యుయేట్స్ సగటు 79 శాతంగా నమోదు కావడం హర్షదాయకం. సాఫ్ట్‌వేర్, వైద్య, ఫైనాన్స్ రంగాల్లో అత్యధిక వేతనాలు కలిగిన ఉద్యోగాల్లో భారతీయ అమెరికన్లే అధికంగా ఉండడం, అమెరికా వైద్యరంగంలో 9 శాతం వైద్యులు భారతీయులే కావడం సంతోషదాయకం. "ఏదేశ మేగినా ఎందుకాలిడినా ఏ పీఠమెక్కినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లిభూమి భారతిని, నిలపరా నీ జాతి నిండు గౌరవము" అన్న సూక్తిని నిజం చేస్తున్న మన అమెరికన్ భారతీయులు మన దేశ ఖ్యాతిని అగ్రరాజ్యంలో ఇనుమడింప చేయాలని కోరుకుంటూ, వారు మన దేశాభివృద్ధిలో కూడా భాగస్వాములు అవుతారని ఆశాభావం వ్యక్తం చేద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం, 2021-22 నుండి 2025-26 వరకు

న్యూఢిల్లీ, ఆగష్టు 30:2021?22 నుండి 2025-26 వరకు ఐదు సంవత్సరాల పాటు నీరు, పారిశుధ్యం కోసం గ్రామీణ స్థానిక సంస్థలు (ఆర్ఎల్‌బిలు)/ పంచాయితీలకు పదిహేనవ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన రూ.1,42,084 కోట్ల టై గ్రాంట్, సేవలకు భరోసా ఇవ్వడంలో, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం, మెరుగైన జీవన ప్రమాణాల దిశగా భారీగా ప్రభావితం చేయనున్నాయి. .

15 వ ఆర్థిక సంఘం టై గ్రాంట్లు గ్రామ పంచాయితీలకు నీటి సరఫరా మరియు పారిశుధ్య సంబంధిత ప్రణాళికలను అమలు చేయడానికి మరిన్ని నిధులను నిర్ధారిస్తుంది. గ్రామ పంచాయితీలు 'సేవా బట్వాడా'పై దృష్టి సారించి స్థానిక 'ప్రజా ప్రయోజనాలు' వలె పనిచేయగలవు. భారత రాజ్యాంగంలోని 73 వ సవరణకు అనుగుణంగా స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయడానికి ఇది ఒక పెద్ద ముందడుగు.

2021?22 నుండి 2025-26 మధ్య కాలంలో ఆర్ఎల్‌బిలు/ పిఆర్ఐల కోసం 15 వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన గ్రాంట్‌ల విడుదల, వినియోగానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ విభాగం, మార్గదర్శకాలను విడుదల చేసింది. 'నీరు, పారిశుధ్యం సంబంధించి 15 వ ఆర్థిక సంఘం టై గ్రాంట్' కోసం గ్రామీణ స్థానిక సంస్థల అర్హతను నిర్ణయించడానికి కేంద్ర ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖ తాగునీరు, పారిశుద్ధ్య విభాగం(డిడబ్ల్యుఎస్) నోడల్ డిపార్ట్‌మెంట్‌గా వ్యవహరిస్తుంది.

నీరు, పారిశుద్ధ్య కార్యకలాపాల కోసం 25 రాష్ట్రాలకు మొదటి విడత మంజూరు చేసిన గ్రాంట్‌ను విడుదల చేయాలని, ఆర్ఎల్‌బిలు/ పిఆర్ఐలకు బదిలీ చేయాలని తాగునీరు, పారిశుధ్య శాఖ సిఫార్సు చేసింది.

కేంద్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్ల బడ్జెట్ మద్దతుతో, జల జీవన్ మిషన్ కోసం రూ.30 వేల కోట్ల రాష్ట్ర వాటా, ఈ సంవత్సరం కేటాయింపు, నీరు, పారిశుధ్యం కోసం 15 వ టైడ్ గ్రాంట్ కింద 28 వేల కోట్లు వెరసి గ్రామాల్లో పైపుల ద్వారా నీటి సరఫరా చేయడానికి ఒక లక్ష కోట్లకు పైగా నిధులు అందుబాటులో ఉన్నాయి. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై భారీగా మంచి ప్రభావాన్ని చూపుతుంది.

15 వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన విధంగా ఆర్ఎల్‌బిలు/పంచాయితీలు తమ విధులు నిర్వర్తించడంలో సహాయపడటానికి, రాష్ట్ర నీటి, పారిశుధ్యం/ గ్రామీణ నీటి సరఫరా/ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగాలు ఈ పంచాయితీలు/ ఆర్ఎల్‌బిలకు సాంకేతిక సహాయం అందిస్తాయి.

ఆర్ఎల్‌బిలు/ పంచాయితీలను సరళీకృతం చేయడానికి, సహాయం చేయడానికి, తాగునీరు డ పరిశుభ్రత విభాగం, జల శక్తి మంత్రిత్వ శాఖ ఈ నిధుల వినియోగం కోసం ఒక మాన్యువల్‌ను సిద్ధం చేసింది. ఇది అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అందుబాటులో ఉంచింది. మాన్యువల్‌ని స్థానిక భాషలోకి అనువదించమని వారు అభ్యర్థించారు.

ఇది ప్రతి గ్రామ పంచాయతీకి అందుబాటులో ఉంచాలి. గ్రామాలలో కుళాయి నీటి సరఫరా, మెరుగైన పారిశుధ్యాన్ని నిర్ధారించడానికి ఈ నిధిని ఉపయోగించుకునేందుకు పంచాయితీ కార్యవర్గాలను చైతన్యపరచడానికి, శిక్షణ ఇవ్వడానికి మరియు శక్తివంతం చేయడానికి ఒక భారీ కార్యక్రమం చేపడుతున్నారు.

మొత్తంగా, 2021-22 నుండి 2025-26 వరకు ఆర్ఎల్‌బిలు/ పిఆర్ఐలకు 15 వ ఆర్థిక సంఘం రూ. 2,36,805 కోట్లు సిఫార్సు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల జీవన నాణ్యతను నిర్ణయించే నీటి సరఫరా, పారిశుధ్యం జాతీయ ప్రాధాన్యతా అంశాలుగా కమిషన్ గుర్తించింది. ఇది 60% కేటాయింపులను ఆర్ఎల్‌బిలు/ పంచాయితీలకు సిఫార్సు చేసింది, అంటే రూ. 1,42, 084 కోట్లు టై గ్రాంట్‌ను ఎ) తాగునీటి సరఫరా, వర్షపు నీటి సేకరణ, నీటి రీసైక్లింగ్; బి) బహిరంగ మల విసర్జన రహిత (ఓడిఎఫ్) పరిశుభ్రత, నిర్వహణకు వినియోగిస్తారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆశయం ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా, మెరుగైన పారిశుద్ధ్యం సాకారం చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఈ రెండు ప్రాథమిక సేవలను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో భాగస్వామ్యంతో పనిచేస్తోంది. తగినంత స్థాయిలో తాగునీటి లభ్యత, గృహ స్థాయిలో నిర్దేశిత నాణ్యత క్రమబద్ధమైన మరియు దీర్ఘకాలిక ప్రాతిపదికన, మరియు మెరుగైన పారిశుధ్యం... ప్రజారోగ్యం, ప్రజల మెరుగైన సామాజిక-ఆర్థిక పరిస్థితిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి.

మౌలికంగా నీటి సరఫరా, పారిశుధ్య సేవలను నిర్ధారించడానికి, 15 వ ఆర్థిక సంఘం ద్వారా గణనీయమైన మొత్తాన్ని వాటికి కేటాయించడం మౌలిక సదుపాయాల కల్పనలో పెద్ద అడుగు.

ఆగస్టు 2019 నుండి, జల్ జీవన్ మిషన్ (జెజెఎం) రాష్ట్రాల భాగస్వామ్యంతో అమలవుతోంది.ఏ ఒక్కరికి కుళాయి నీరు లేదని అనకుండా, ప్రతి గ్రామీణ ఇంటికీ కుళాయి నీటి సరఫరా అందించడానికి రూ. 3.60 లక్షల కోట్లు కేటాయింపు జరిగింది. ప్రతి గ్రామీణ గృహానికి సరసమైన సర్వీస్ డెలివరీ ఛార్జీల వద్ద క్రమం తప్పకుండా, దీర్ఘకాలిక ప్రాతిపదికన తాగునీటి సరఫరాను పొందడానికి వీలు కల్పిస్తుంది, తద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది.

గత ఏడు సంవత్సరాలలో, గ్రామాలు బహిరంగ మల విసర్జన రహిత (ఓడిఎఫ్) గా మారడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరిగాయి. ఈ ప్రయత్నాలను సుస్థిరంగా కొనసాగించడానికి స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్బిఎం) రెండవ దశ అమలులో ఉంది. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ రహిత గ్రామాలు, మరియు గ్రామాల ఓడిఎఫ్ స్థితిని నిర్ధారించడంపై దృష్టి సారించారు.

గత 20 నెలల్లో, కోవిడ్ -19 మహమ్మారి సమయంలో ప్రజారోగ్యం ప్రాముఖ్యత విస్తృతంగా గుర్తించబడింది. అందువల్ల, మన గ్రామాల్లో పరిశుభ్రమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్యం అందించడం చాలా ముఖ్యం. ఈ సేవలను పొందడం, అలాగే నీటి ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించడం ద్వారా ప్రజారోగ్యానికి బాసటగా నిలిచేందుకు 15 వ ఆర్థిక సంఘం టైడ్ గ్రాంట్ గ్రామీణ ప్రాంతాలకు ఒక వరంగా మారాయి.

నీరు, పారిశుధ్యం కోసం టైడ్ గ్రాంట్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి, రాష్ట్రాలు నోడల్ విభాగాలను గుర్తించాలి. 15 వ ఆర్థిక సంఘం కాలంలో మార్గదర్శకాల ప్రకారం వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇంకా, గ్రామీణ స్థానిక సంస్థలు/ పంచాయితీ రాజ్ సంస్థల ప్రజలకు టై-గ్రాంట్లు, దాని విడుదల, మరియు వినియోగం, ప్రణాళిక, అమలు, పని, ఆడిట్, అకౌంటింగ్ మొదలైన వాటిపై పెద్ద ఎత్తున శిక్షణ కార్యక్రమం నిర్వహించాలి. దీని కోసం, జాతీయ జల జీవన్ మిషన్, తాగునీరు, పారిశుద్ధ్య విభాగం 84 ప్రముఖ సంస్థలను కీలక వనరుల కేంద్రాలుగా (కేఆర్సి) ఎంపిక చేసింది.

గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య సేవలపై పునరావృతమయ్యే ఖర్చులను తీర్చడానికి వరుసగా వచ్చే ఆర్థిక సంఘాల సిఫార్సులకు అనుగుణంగా గృహాల నుంచి సేవా ఛార్జీలను తిరిగి పొందడానికి రాష్ట్రాలలో బలమైన 'ఆపరేషన్ మరియు మెయింటెనెన్స్' విధానాన్ని అమలు చేయడంపై దృష్టి పెట్టడం జరిగింది. రాజ్యాంగంలోని 73 వ సవరణ ప్రకారం, పంచాయతీల ప్రధాన విధుల్లో ఒకటిగా పరిగణించబడే గ్రామాలలో ఈ రెండు ప్రాథమిక సేవలను నిర్వహించడానికి గ్రామ పంచాయతీలకు అధికారం ఉంది.

గాంధీజీ 'గ్రామ స్వరాజ్' కి అనుగుణంగా గ్రామ పంచాయితీలు స్థానిక స్వపరిపాలనను పునర్నిర్వచించటానికి ఈ టైడ్ గ్రాంట్ ఒక సువర్ణ అవకాశాన్ని అందించింది. ఇది అట్టడుగు స్థాయిలో 'బాధ్యతాయుతమైన మరియు ప్రతిస్పందించే నాయకత్వాన్ని' అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. ఈ సాధికారత ప్రక్రియ గత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశాన్ని ఉద్దేశించి ప్రధాని ప్రసంగంలో ప్రకటించిన 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ మరియు సబ్కా ప్రయాస్' అనే నినాదానికి అనుగుణంగా ఉంటుంది.

సృజనాత్మక మార్గాల్లో తెలుగు భాష ఆధునీకరణ జరగాలి - ఉపరాష్ట్రపతి

-తెలుగులో చదవడం, మాట్లాడటం ఓ అభిరుచి (ప్యాషన్) కావాలి
-తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు గారికి ఉపరాష్ట్రపతి నివాళులు
-తెలుగు భాషను సమున్నతంగా తీర్చిదిద్దడమే శ్రీ గిడుగు వారికిచ్చే నిజమైన నివాళి అని ఉద్ఘాటన
-తెలుగు భాష పరిరక్షణ, వ్యాప్తి కోసం 16 సూత్రాలను ప్రతిపాదించిన ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు
-కొత్త పదాల సృష్టి జరగాలి, మన భాషలో సహజంగా ఇమిడిపోయే పదాలను ఆహ్వానించాలి
-తెలుగులో మాట్లాడ్డం ఆత్మన్యూనతగా భావించే భావదాస్యం పోవాలి
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి మాతృభాషలో చదువుకున్న వారే
-మాతృభాష పట్ల అతి ప్రేమతో ఇతర భాషలను ద్వేషించే తత్వం అనర్థదాయకం
-ఆటపాటలతో అమ్మ భాషను నేర్పించే సృజనాత్మక పద్ధతులను అన్వేషించాలి
-సాహిత్య సేవ చేసే వారంతా భాషా సేవ మీద దృష్టి పెట్టాలి
-అమ్మఒడిలో, చదువుల బడిలో, బతుకు మడిలో, సంస్కారపు గుడిలో, గుండె తడిలో, తెలుగు నుడి మన పలుకుల సడి కావాలి.
- తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా దక్షిణాఫ్రికా తెలుగు సంఘం, వీధి అరుగు నిర్వహించిన "తెలుగు భవి

హైదరాబాద్ , ఆగష్టు 30:సృజనాత్మక మార్గాల్లో తెలుగు భాష ఆధునీకరణ జరగాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. తెలుగు భాషను చదవడం, రాయడం, మాట్లాడం ఓ అభిరుచి (ప్యాషన్) కావాలన్న ఆయన, భారతదేశంలోని అనేక ప్రాచీన భాషల్లో ఒక్కటైన తెలుగును పరిరక్షించుకుని, మరింత సమున్నతంగా తీర్చిదిద్దడమే శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు గారికి ఇచ్చే నిజమైన నివాళి అన్న ఆయన, తెలుగు భాష పరిరక్షణ కోసం 16 సూత్రాలను ప్రతిపాదించారు.

వాడుక భాష ఉద్యమ వ్యాప్తి ద్వారా తెలుగు భాషకు గొడుగు పట్టిన శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు గారి జయంతి, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా దక్షిణాఫ్రికా తెలుగు సంఘం, వీధి అరుగు నిర్వహించిన "తెలుగు భవిష్యత్తు ? మన బాధ్యత" అంతర్జాల కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రారంభంలో శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు గారి చిత్ర పటానికి అంజలి ఘటించిన ఉపరాష్ట్రపతి, తెలుగు భాషను సమున్నతంగా తీర్చిదిద్దడమే శ్రీ గిడుగు వారికిచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. తెలుగు భాషను కాపాడుకోవాలనే సత్సంకల్పంతో తెలుగు వారంతా ఒకే వేదిక మీదకు రావడం అభినందనీయమన్న ఆయన, ఈ కార్యక్రమ ఏర్పాటుకు ప్రోత్సాహాన్ని అందించిన ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు అభినందనలు తెలిపారు.

ప్రపంచంలోని అతి ప్రాచీన భాషల్లో తెలుగు కూడా ఒకటి అన్న ఉపరాష్ట్రపతి, మన భాషను మనం పొగుడుకుంటూ కూర్చుంటే సరిపోదని, ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఆలంబనగా పట్టం కట్టి, ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలుగు భాష అందరికీ చేరువ కావాలన్న సంకల్పంతో శ్రీ గిడుగు వారు వ్యావహారిక భాషోద్యమానికి శ్రీకారం చుట్టారన్న ఆయన, గ్రాంథికమే గ్రంథాల భాషగా చెలామణి అవుతున్న రోజుల్లో, పుస్తకాల్లోనూ సులభమైన తెలుగును వాడాలని ఉద్యమించారని గుర్తు చేశారు.

మనుషి నుంచే పుట్టిన భాష కేవలం మాటల వారధి మాత్రమే కాదని, మన మూలాలను తెలియజేసి మనల్ని ముందుకు నడిపే సారధి అన్న ఉపరాష్ట్రపతి, మన ఆటలు, మాటలు, పాటలు, సంగీతం, కళలు, పండుగలు, పబ్బాలు, సామూహిక కార్యక్రమాలు. వ్యాపార సంబంధాలు ఇవన్నీ భాష లేకుండా పెంపొందలేవని తెలిపారు. భాష సమాజాన్ని సృష్టించి, జాతిని బలపరిచి, అభివృద్ధికి మార్గం వేస్తుందని ఉద్ఘాటించారు. మన పూర్వీకులు మన సంస్కృతిని, మన భాషలోనే నిక్షిప్తం చేశారన్న ఆయన, ఆ మాధుర్యాన్ని మనసారా ఆస్వాదించిన ఎవరికైనా అమ్మపాలు అందించినంత బలాన్ని, అమ్మ భాష అందించి తీరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

తెలుగు భాషను నేర్చుకోవడం, తెలుగు సంస్కృతిని పెంపొందించుకోవడం ప్రతి తెలుగు వాడు తన బాధ్యతగా గుర్తెరగాలన్న ఉపరాష్ట్రపతి, భాష మన అస్తిత్వాన్ని చెప్పడానికే కాదు, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి కూడా అని తెలిపారు. ఎందరో కవులు తమ కావ్యాల్లో మన సంస్కృతిని నిక్షిప్తం చేశారన్న ఆయన, అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మేంద్ర స్వామి లాంటి వారు సామాజిక అభ్యుదయానికి బాటలు వేశారని తెలిపారు. ఏనుగు లక్ష్మణ కవి, బద్దెన లాంటి వారు సవ్యమార్గంలో నీతిని బోధించగా, సమయస్ఫూర్తిని పెంచే తెనాలి రామకృష్ణుడి కథలు, ప్రపంచ సరళిని తెలిపే భట్టి విక్రమార్క కథలు, మన నడతను నిర్దేశించే పంచతంత్ర కథలు జీవితాన్ని తీర్చిదిద్దుతాయని తెలిపారు.

ముఖ్యంగా అన్నమయ్య కీర్తనలు ఉగ్గు పట్టడం మొదలుకుని వ్యవసాయం, వర్తకం దాకా మన తెలుగు సాంఘిక జీవనాన్ని ప్రతిబింబిస్తాయన్న ఉపరాష్ట్రపతి, తెలుగు పద్య పునాదుల కలిగి ఉన్న అవధాన ప్రక్రియ తెలుగు వారికి గర్వకారణమని తెలిపారు. తెలుగులో చదువుకోవడం, మాట్లాడడం ఆత్మన్యూనతగా భావించే భావదాస్యాన్ని వదలించుకోవాలన్న ఆయన, భారత రాష్ట్రపతి, తాను, ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లాంటి వారు మాతృభాషలో చదువుకున్న వారమేనని గుర్తు చేశారు.

తెలుగు భాషకు ఘనమైన ప్రాచీన చరిత్ర ఉందన్న ఉపరాష్ట్రపతి, ముందుతరాలకు అందించేందుకు భాష ఆధునీకరణ జరగాలని, భాషా వ్యాప్తికి సృజనాత్మక మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో తెలుగు భాష, సంస్కృతులను పరిరక్షించుకునే దిశగా 16 సూత్రాలను ప్రతిపాదించారు.

1. తెలుగు భాష, సంస్కృతులను గౌరవించాలి.
2. ప్రాథమిక విద్య మొదలుకుని, సాంకేతిక విద్య వరకూ మాతృభాష వినియోగం పెరగాలి.
3. తెలుగులో మాట్లాడడం ఆత్మన్యూనత అనుకునే భావాన్ని పోగొట్టుకోవాలి. మన భాషను ప్రేమించాలి. ఇతర భాషలను గౌరవించాలి.
4. ప్రజల భాష, ప్రభుత్వ భాష అంటే పాలనా భాష ఒక్కటే కావాలి.
5. కొత్త పదాల సృష్టికి ప్రయత్నించాలి. మన భాషలో సహజంగా ఇమిడిపోయే పదాలను ఆహ్వానించాలి.
6. ఇతర భాషల్లో తెలుగు సాహిత్య అనువాదానికి చొరవ తీసుకోవాలి.
7. కంప్యూటర్లలో తెలుగు భాష వినియోగాన్ని పెంచాలి. తెలుగు ఖతుల వినియోగం విషయంలో మరింత చొరవ పెరగాలి.
8. వారంలో కనీసం ఒక్క రోజైనా "తెలుగు వారం" పేరిట తెలుగు మాట్లాడడంతో ప్రారంభించి, వారమంతా తెలుగు వారమయ్యేలా అదే అలవాటు చేసుకోవాలి.
9. తెలుగు భాష, సంస్కృతులను పిల్లలకు తెలియజేసేందుకు ఆటవిడుపు పేరుతో రోజుకు కనీసం ఓ అరగంటను తల్లిదండ్రులు కేటాయించాలి.
10. పిల్లలకు ఆటపాటల ద్వారా సృజనాత్మక మార్గాల్లో తెలుగు భాషను నేర్పించే ప్రయత్నాలు మరింత పెంచాలి.
11. పెళ్ళిళ్ళు, శుభకార్యాల్లో భాష ప్రాధాన్యత పెంచాలి.
12. గ్రంథాలయ సంస్కృతిని పెంచి, తెలుగు పుస్తకాలను బహుమతులుగా ఇచ్చేలా ప్రోత్సహించాలి.
13. నలుగురు చేరే దేవాలయాల్లో తెలుగు వినియోగాన్ని మరింత పెంచాలి.
14. తెలుగు ఆహారపు అలవాట్లను సజీవంగా ఉంచుతూ, మన సంప్రదాయ వంటకాల పేర్లను నేటి తరానికి తెలియజేయాలి.
15. మన కట్టు, బొట్టు కాపాడుకుంటూ... ఇంట, బయట మన దుస్తులు ధరించేలా యువతను ప్రోత్సహించాలి.
16. చదువవంటే ఇంగ్లీషే అన్న భావన పోవాలి. భావదాస్యాన్ని వదలించుకోవాలి.

ఈ పదహారు సూత్రాలను పాటిస్తూ మాతృభాషను కాపాడుకునేందుకు భాషాభిమానులు, భాషావేత్తలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు ముందుకు రావాలని పిలుపునిచ్చిన ఉపరాష్ట్రపతి, వీటి ద్వారా మన భాష తన అస్తిత్వంతో పాటు, మన అస్తిత్వాన్ని కాపాడగలుగుతుందని దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సాహిత్య సేవకు, భాషా సేవకు మధ్య ఉన్న తేడాను తెలియజేసిన ఉపరాష్ట్రపతి, రెండూ ఒకటి కాదని, తెలుగు రాని వారు కూడా భాషా సేవను చేశారని తెలిపారు. సాహిత్య సేవలో ఉన్న వారంతా భాషా సేవను కూడా శిరోధార్యంగా భావించాలని సూచించారు. తెలుగు భాషా ప్రవాహం ఎటువైపు మళ్లించాలని విషయంపై తెలుగు వాళ్ళంతా మరింత జాగురూకతతో ముందుకు సాగాలన్న ఆయన, భాషను కాపాడుకుని ముందు తరాలకు అందించేందుకు కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయడమే గాక, ఇప్పటి వ్యవస్థలను మెరుగ్గా పని చేసేలా చొరవ తీసుకోవాలని, అప్పుడే భాషా పరిరక్షణ, ఆధునీకరణ సాధ్యమౌతాయని సూచించారు.

తెలుగు భాషను కాపాడుకునేందుకు కలిసికట్టుగా ఉద్యమస్ఫూర్తితో పనిచేయడానికి మించిన మార్గం లేదని పునరుద్ఘాటించిన ఉపరాష్ట్రపతి, అమ్మ ఒడిలో... చదువుల బడిలో... బతుకు మడిలో.... సంస్కారపు గుడిలో... గుండె తడిలో... తెలుగు నుడి... మన పలుకుల సడి కావాలని సూచించారు. అమ్మభాషతో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచుకుని, ఆత్మనిర్భర భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

కార్యక్రమాన్ని సంప్రదాయ నృత్య నీరాజనంతో ప్రారంభించడాన్ని ఉపరాష్ట్రపతి అభినందించారు. మనవైన సంప్రదాయాలను కాపాడుకుంటూ మన జానపద, సంప్రదాయక కళలకు ప్రోత్సాహం అందిచాలని సూచించారు. ఆగస్టు 29న క్రీడా దినోత్సవ నేపథ్యంలో క్రీడల ప్రాధాన్యతను ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, అత్యున్నత క్రీడా శక్తిగా భారతదేశాన్ని నిలబెట్టేందుకు ప్రభుత్వ ప్రయత్నాలకు తోడు కార్పొరేట్ సంస్థలు సహా ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని పిలుపునిచ్చారు. భారతీయ యువశక్తికి కాస్తంత తోడ్పాటు అందించగలిగితే, క్రీడారంగంలో అద్భుతాలు సాధ్యమౌతాయని పేర్కొన్నారు.

అంతర్జాల వేదిక ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ సతీష్ రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థాన చైర్మన్ శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, దక్షిణాఫ్రికా తెలుగు సంఘం సంస్థాపక అధ్యక్షులు శ్రీ విక్రమ్ పెట్లూరి, వీధి అరుగు సంస్థాపక అధ్యక్షులు శ్రీ వెంకట్ తరిగోపుల సహా ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన భాషావేత్తలు, భాషాభిమానులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

బెంగళూరు మెట్రో ప్రాజెక్టు రెండవ దశలో వెస్టర్న్ ఎక్స్టెన్షన్‌ను ప్రారంభించిన హర్దీప్ సింగ్ పురీ

బెంగళూరు ,ఆగష్టు 30: బెంగళూరు నమ్మ మెట్రో పథకం రెండవ దశలో భాగంగా మైసూరు నుంచి కెంగెరీ మెట్రో స్టేషన్ వరకు 7.5 కిమీల పొడవున వేసిన వెస్టర్న్ ఎక్స్‌టెన్షన్ మెట్రోలైన్‌ను కేంద్ర హౌజింగ్ డ అర్బన్ వ్యవహారాలు, పెట్రోలియం, సహజవాయువు మంత్రి హర్దీప్ సింగ్ పురీ కర్నాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మాయ్ సమక్షంలో ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ, అప్లైడ్ సైన్సెస్ పరిశోధనలకు సంబంధించిన బలమైన ఉనికి దేశపు ఆర్థిక వృద్ధికి బెంగళూరు ప్రధాన సాధనమని, కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు. దేశం నుంచి చేసే మొత్తం ఐటి ఎగుమతులలో ఈ నగరం 38% వాటాను కలిగి ఉంది. ఈ వెస్టర్న్ ఎక్స్టెన్షన్ మెట్రోలైన్‌ను నేడు ప్రారంభించడం అన్నది నగరంలో త్వరిత గతిన ప్రయాణించడానికి, చురుకుగా గతిశీలతను కలిగి ఉండే దిశగా వేసిన అడుగు అని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనిక నాయకత్వం కింద, నగరీకరణ దిశగా విధాన రూపావళిలో మార్పు వచ

ఊరట: ఆరోగ్యశ్రీలోకి కరోనా వైద్యం..!

హైదరాబాద్ , ఆగష్టు 30:కరోనా థర్డ్ వేవ్ ముందట తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఊరటనిస్తోంది. ఇప్పటికే మొదటి, రెండో వేవ్ లో అల్లకల్లోలం సృష్టించిన కరోనా థర్డ్ వేవ్ ఆందోళనలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇక కరోనా కల్లోలం సృష్టిస్తోన్న సమయంలో ఎక్కువగా ప్రతిపక్షాల నుంచి, ప్రజల నుంచి ఎక్కువగా వినిపించిన మాట కరోనాను ఆరోగ్య శ్రీలో చేర్చాలని. ఇక ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ (ఏబీ)లో కరోనా చికిత్సను ఇప్పటికే చేర్చగా, ఏబీని రాష్ట్రంలోనూ అమలు చేస్తున్నారు. దీంతో ఇకపై ఈ పథకం 'ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్' పేరిట అమలు కానుంది.

కరోనా చికిత్సను మొత్తం 17 రకాలుగా విభజించగా, అందులో 14 రకాలకు ప్రభుత్వాసుపత్రులలో వైద్యం అందిస్తారు. క్రమంగా దీనిని ప్రైవేటు ఆసుపత్రులకూ విస్తరిస్తారు. అక్యూట్ ఫెబ్రైల్ ఇల్‌నెస్, పైరెక్సియా ఆఫ్ అన్‌నోన్ ఆరిజిన్, నిమోనియా ఉన్నాయి. వీటితోపాటు మిగిలిన 14 రకాలకు ప్రభుత్వాసుపత్రులలోనే వైద్యం అందనుండా.. దశలవారీగా ప్రైవేట్ ఆస్పత్రలకు విస్తరించే అవకాశం ఉందని చెబుతున్నారు అధికారులు. 50 పడకలున్న ఆసుపత్రులకు మాత్రమే ప్రస్తుతం ఆరోగ్యశ్రీకి అనుమతి లభిస్తుండగా, ఆయుష్మాన్ భారత్ చేరికతో ఆరు పడకలున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు, 30 పడకలున్న సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ రాకతో ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి వచ్చిన చికిత్సల సంఖ్య 1,668కి పెరిగింది. అయితే వీటిలో 642 చికిత్సలను ప్రస్తుతానికి ప్రభుత్వ వైద్యంలోనే కొనసాగించాలని నిర్ణయించారు. మరోవైపు.. ఇప్పటివరకూ ఆరోగ్యశ్రీ పరిధిలో కేవలం 50 బెడ్స్ ఉన్న ఆస్పత్రులకు మాత్రమే అనుమతి ఉండగా.. ఆయుష్మాన్ భారత్ చేరికతో ఇకనుంచి 6 బెడ్స్ ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో.. 30 బెడ్స్ ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. 6 బెడ్స్ ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌ను అమలు చేయడానికి అవసరమైన గైడ్‌లైన్స్‌ను రూపొందించిన తర్వాత.. దీనిపై ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు.

హుజురాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా కొండా సురేఖ..!: ఇవాళ ప్రకటించే అవకాశం

హైదరాబాద్ , ఆగష్టు 30:రేవంత్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టాక పార్టీలో కొత్త జోష్ వచ్చిందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, అదే ఒరవడి కొనసాగింపుగా టి.పీసీసీ ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న హుజురాబాద్ ఉపఎన్నికలకు తమ అభ్యర్థి పేరును ఇవాళ ప్రకటించే అవకాశముంది. ఇక ఇప్పటికే హైదరాబాద్ వచ్చిన ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంఛార్జ్ మణికం ఠాగూర్.. ఇవాళ గాంధీ భవన్‌లో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు? ఈ సమావేశంలో ముఖ్యంగా గజ్వేల్ సభ, హుజురాబాద్ ఉప ఎన్నికపై చర్చించనున్నట్టుగా తెలుస్తోంది.. ఇక, ఇప్పటికే పలు పేర్లను హుజురాబాద్ ఉప ఎన్నికల్లో బరిలో దింపేందుకు పరిశీలించిన పీసీసీ.. ఫైనల్‌గా మాజీ మంత్రి, సీనియర్ నేత కొండా సురేఖ వైపు మొగ్గుచూపినట్టు తెలుస్తోంది.. గాంధీ భవన్ వేదికగా ఇవాళ జరిగే సమావేశంలో హుజురాబాద్ అభ్యర్థి ఎంపిక కూడా కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

లోక్‌సభలో నక్షత్రం గుర్తు ప్రశ్న నం.84కు ఇచ్చిన సమాధానంలో సవరణ

న్యూఢిల్లీ, ఆగష్టు 30:దేశవ్యాప్తంగా 2020 మార్చి నుంచి ఇప్పటిదాకా పెట్రోలు, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు, సుంకాలు, అదనపు సుంకాలతోపాటు రాష్ట్రాలకు సంబంధించి నెలవారీగా వివరాలు కోరుతూ లోక్‌సభలో గౌరవ సభ్యులొకరు వేసిన నం.84 నక్షత్రపు గుర్తు ప్రశ్నకు 2021 జులై 26న సమాధానం ఇవ్వబడింది. ఈ ప్రశ్నపై ఇచ్చిన జవాబుతోగల అనుబంధంలో 01.07.20 నుంచి 22.07.21 మధ్యకాలంలో రాష్ట్రాలవారీగా పన్నులు, సుంకాల విధింపులో వ్యత్యాసాలుసహా వసూలైన పన్నుల వివరాలు వేర్వేరుగా ఇవ్వబడ్డాయి. ఇందులో భాగంగా అనుబంధంలోని మూడో కాలంలో ఇచ్చిన నగరాల పేర్లు సంబంధిత రాష్ట్రంలో విధించే పన్నులు, సుంకాల కోణంలో ప్రస్తావించబడినవి మాత్రమే. అందువల్ల కాలమ్ నంబర్: 3 శీర్షికను దయచేసి "రాజధాని నగరం/ ప్రస్తావన నగరం"గా మాత్రమే పరిగణించాలని కోరడమైనది.

వికారాబాద్ విషాదం.. వరుడు క్షేమం.. వధువు మృతి

వికారాబాద్, ఆగష్టు 30:వికారాబాద్ జిల్లా విషాద ఘటన చోటుచేసుకుంది. మర్పల్లి మండలం తిమ్మాపూర్ వాగులో కొట్టుకుపోయిన పెళ్లిబృందం కారు లభ్యమైంది. కారులో ఆరుగురు ప్రయాణిస్తుండగా.. వరుడు నవాజ్ రెడ్డి, ఆయన అక్క క్షేమంగా బయటపడ్డారు. నవ వధువు ప్రవల్లిక, శ్వేతా, డ్రైవర్ రాఘవేందర్ రెడ్డి మృతదేహాలను వెలికితీశారు. ఎనిమిది సంవత్సరాల ఇషాంత్ రెడ్డి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా, నిన్న రాత్రి వరద ఉధృతికి కారు వాగులో కొట్టుకుపోయింది. ఈ నెల 26న రావులపల్లికి చెందిన నవాజ్‌రెడ్డికి మోమిన్ పేటకు చెందిన ప్రవల్లికతో వివాహం జరిగింది. నిన్న వధువు ఇంటి నుంచి రావులపల్లి వెళ్తుండగా తిమ్మాపూర్ వద్ద వాగు ఉధృతికి కొట్టుకుపోయింది. వధూవరులతో పాటు నవాజ్ రెడ్డి అక్కలు శ్వేత, రాధమ్మ, మరో బాలుడు కారులో ఉన్నారు. వద్దని వారించినా వాగు దాటేందుకు ప్రయత్నించడంతో ప్రమాదంలో చిక్కుకున్నట్లు చెబుతున్నారు

ఢిల్లీలో కొవిడ్ పాజిటివిటీ రేటు 0.4శాతమే : సత్యేంద్ర జైన్

న్యూఢిల్లీ, ఆగష్టు 30:దేశ రాజధానిలో కొవిడ్ కేసులు తక్కువగానే నమోదవుతున్నాయని, పరిస్థితి నియంత్రణలో ఉందని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యేంద్ర జైన్ అన్నారు. పాజిటివిటీ రేటు 0.4 శాతంగా ఉందని పేర్కొన్నారు. ఆరు నెలల్లోపు ఏడు ఆసుప్రతుల్లో 6,800 కంటే ఎక్కువ ఐసీయూ పడకలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా ఢిల్లీలో ఆదివారం కొత్తగా 31 కొత్త కొవిడ్ కేసులు నమోదయ్యాయి. దేశ రాజధానిలో వరుసగా నాలుగో రోజూ మరణాలు నమోదు కాలేదని ప్రభుత్వం తెలిపింది. మరో వైపు కొవిడ్ కేసులు తగ్గుతూ వస్తుండడంతో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి దశల వారీగా పాఠశాలలను తెరిచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

ఆజాదికా అమృతోత్సవ్‌లో భాగంగా ప్రచార కార్యక్రమాలను ప్రకటించిన ఆయుష్ మంత్రి సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, ఆగష్టు 30:కేంద్ర ఆయుష్ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్, ఆజాదికా అమృత్ మహోత్సవ్ సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యకలాపాలు మరియు ప్రచారాల కార్యక్రమాలను ప్రకటించారు. విజ్ఞాన్ భవన్ నుండి వై బ్రేక్ యాప్ జాతీయ ప్రారంభోత్సవం, వ్యవసాయ భూముల్లో ఔషధ మొక్కల పెంపకం, గృహాలకు ఔషధ మొక్కల పంపిణీ, ఆయుష్ వ్యవస్థలపై పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు అవగాహన కల్పించడం వీటిలో ముఖ్యమైనవి.

ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 5 వరకు వారం రోజుల ప్రచార కార్యక్రమాలు దేశంలోని మారుమూల ప్రాంతాల వరకు వెళ్లేలా, పిల్లల నుండి వృద్ధుల వరకు, రైతుల నుండి కార్పొరేట్ వరకు జనాభాలోని అన్నివర్గాలకు చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామని శ్రీ సోనోవాల్ చెప్పారు.

ఆజాది కా అమృత్ మహోత్సవం భారతదేశ స్వాతంత్ర్య 75 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాల శ్రేణి. ప్రజా భాగస్వామ్య స్ఫూర్తితో ఈ మహోత్సవాన్ని జన్-ఉత్సవ్‌గా జరుపుకుంటున్నాము.

ఆగష్టు 31 న రైతులకు ప్రయోజనం చేకూర్చే 75,000 హెక్టార్ల భూమిలో ఔషధ మొక్కల పెంపకం, సెప్టెంబర్ 1 న ఆఫీసు వెళ్లేవారి కోసం ఐదు నిమిషాల యోగా ప్రోటోకాల్, ప్రత్యేక దృష్టితో ఆయుష్ రోగనిరోధక మందుల పంపిణీ వంటి కార్యకలాపాలు ఉన్నాయి. సెప్టెంబరు 3న 'ఆయుష్‌ఆప్‌కేద్వార్' కార్యక్రమం కింద సంవత్సరంలో 75 లక్షల కుటుంబాల గడపలకు ఔషధ మొక్కలను తీసుకొని సెప్టెంబర్ 2 న పైన పేర్కొన్న 60 సంవత్సరాల వయస్సు గ్రూప్, సెప్టెంబర్ 4 న పాఠశాల మరియు కళాశాల విద్యార్థులకు ఐజిసి మెటీరియల్ పంపిణీ మరియు సెప్టెంబర్ 5 న వై-బ్రేక్ అప్లికేషన్‌పై వెబ్‌నార్ నిర్వహిస్తారు. ఆగస్టు 30 న ఆయుష్ షెల్టర్ ద్వారా తుఫానును తట్టుకోవడం అనే అంశంపై ఆయుష్ విద్యార్థులకు జాతీయ వెబ్‌నార్‌తో ఆయుష్ వారం ప్రారంభమవుతుంది.

విలేకరుల సమావేశంలో ప్రసంగించిన శ్రీ సోనోవాల్, దేశ ప్రజల ప్రయోజనాల కోసం ఆయుష్ మంత్రిత్వ శాఖ తన సర్వీస్ డెలివరీని మెరుగుపరిచే అవకాశాన్ని అందిపుచ్చుకుందని అన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పాల్గొని మంత్రిత్వ శాఖ ప్రయత్నంలో సహాయపడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

"ఆయుష్ సమాజంలోని అన్ని వర్గాలకు సేవ చేయగల సామర్థ్యం, జ్ఞానం కలిగి ఉంది. ఈ వారంలో మేము మాకున్న బలాన్ని, నిబద్ధతతో వినియోగిస్తాము" అని కేంద్ర ఆయుష్ మంత్రి చెప్పారు.

75,000 హెక్టార్ల విస్తీర్ణంలో ఔషధ మొక్కల పెంపకం ప్రచారాన్ని ప్రారంభించడం వలన, ఔషధాల లభ్యతను నిర్ధారిస్తుంది మరియు రైతులకు స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుందని శ్రీ సోనోవాల్ అన్నారు. జాతీయ ఔషధ మొక్కల బోర్డు ద్వారా ఈ కార్యాచరణ అమలు చేస్తారు. లక్ష్యాన్ని సాధించడానికి అన్ని రాష్ట్ర ఔషధ మొక్కల బోర్డులు ఈ కార్యంలో ఉంటాయి అని తెలిపారు. "ఇది రైతులకు పెద్ద ప్రయోజనం చేకూరుస్తుంది," అని ఆయన చెప్పారు.

వై-బ్రేక్ అప్లికేషన్ ప్రారంభించడం ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రణాళిక చేసిన అతి ముఖ్యమైన కార్యకలాపాలలో ఒకటి. అప్లికేషన్ విజ్ఞాన్ భవన్ నుండి ప్రారంభిస్తారు. యోగా ప్రోటోకాల్‌లో ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులతో సహా కష్టపడి ఎక్కువ సమయం వారి వృత్తి ఉద్యోగాలకే వెచ్చిస్తున్న వారి ఒత్తిడిని తగ్గించడానికి, రిఫ్రెష్ చేయడానికి, వారి పని ప్రదేశాలలో మెరుగైన రోగనిరోధక శక్తితో తిరిగి దృష్టి పెట్టడానికి సహాయపడుతుంది.

"వై- బ్రేక్ మొబైల్ అప్లికేషన్ ఎం.డి.ఎన్.ఐ.వై (మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా) లో అభివృద్ధి చేసారు. ఈ యాప్ ద్వారా, యోగా, ధ్యానం కేవలం 5 నిమిషాల్లో ఎక్కడైనా చేయవచ్చు, " అని కేంద్ర ఆయుష్ మంత్రి చెప్పారు.

60 సంవత్సరాల వయసు పైబడ్డవారి పట్ల ప్రత్యేక దృష్టి సారించి ఆయుష్ రోగనిరోధక ఔషధాల పంపిణీ సమాజానికి కోవిడ్ మహమ్మారికి వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది. వివిధ ఆయుష్ వ్యవస్థల కోసం జారీ చేయబడిన కోవిడ్ సంబంధిత ప్రోటోకాల్‌లు ఉన్నాయి. ఆహారం మరియు జీవనశైలికి సంబంధించిన మార్గదర్శకాలను కూడా మంత్రిత్వ శాఖ వ్యాప్తి చేస్తుంది.

'ఆయుష్‌ఆప్‌కేద్వార్' కార్యక్రమం కింద, కిచెన్ గార్డెన్‌లో ఔషధ మొక్కలను పెంచే భావనను ప్రోత్సహించడానికి ఇంటింటికీ పంపిణీ చేస్తారు.. ఇది సాధారణ అనారోగ్యాల కోసం గృహాలు తమ తోటల నుండి మందులను ఉపయోగించుకోవడానికి సహాయపడుతుంది. ఆయుష్ వైపు యువత ను ఆకర్షితులను చేయడానికి, వారు ఆరోగ్యంగా ఉండేలా సహాయపడటానికి, హయ్యర్ సెకండరీ పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థుల కోసం ఆయుష్ వ్యవస్థపై వరుస అవగాహనా ఉపన్యాసాలు కూడా వారంలో ప్రారంభిస్తారు. వారికి ఐఈసి మెటీరియల్ పంపిణీ చేస్తారు.

"ఆయుష్ మంత్రిత్వ శాఖ చేసిన ప్రయత్నాల గురించి దేశంలోని వివిధ సంస్థల విద్యార్థులకు అవగాహన కల్పిస్తాము. వారిని ఆయుష్ రంగాలతో అనుసంధానిస్తాము." అని కేంద్ర మంత్రి వివరించారు.

మైసూరులో కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను ప్రారంభించిన సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 30:'ప్రజల చేత, ప్రజల ద్వారా, ప్రజల కోసం' అనే సూత్రం కమ్యూనిటీ రేడియో స్టేషన్లకు సంపూర్ణంగా వర్తిస్తుందని, మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, సమాచార డ ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో జేఎస్ఎస్ మహా విద్యా పీఠంలో పవిత్ర జగద్గురు డాక్టర్ శ్రీ శివరాత్రి రాజేంద్ర మహాస్వామి 106వ జయంతి వేడుకల సందర్భంగా కమ్యూనిటీ రేడియో స్టేషన్ (జేఎస్ఎస్ రేడియో 91.2 ఓఊళి) ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 329 కార్యాచరణ కమ్యూనిటీ రేడియో స్టేషన్లు ప్రసారమవుతున్నాయి, వీటిలో 22 కర్ణాటకలో ఉన్నాయి జేఎస్ఎస్ రేడియో అనేది మైసూర్ నగరంలో ప్రసారమయ్యే మూడవ కమ్యూనిటీ రేడియో స్టేషన్. "వెనుకబడిన ప్రాంతాలలో కింది స్థాయి వ్యక్తుల మీడియాగా, కమ్యూనిటీ రేడియో ఇటీవలి సంవత్సరాలలో ప్రజాదరణ పొందింది మరియు విధానకర్తలు మరియు అట్టడుగు వర్గాల ప్రజలు తమ సంఘం అభివృద్ధి ప్రక్రియలో పాల్గొనేలా ఇది ఒక కొత్త శకానికి తెరతీస్తుంది" అని మంత్రి తెలిపారు. స్థానిక జనాభాలో కమ్యూనిటీ రేడియో స్టేషన్ల యొక్క ప్రాముఖ్యతను మంత్రి ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. కోవిడ్ 19 గురించి అవగాహన కల్పించడంలో, అలాగే మహమ్మారి సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాల గురించి తెలియజేయడంలో కమ్యూనిటీ రేడియో స్టేషన్లు ముఖ్యమైన పాత్ర పోషించాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ సుత్తూర్ మఠం యొక్క సహకారాన్ని తెలియజేస్తూ ఈ మఠం దక్షిణ భారతదేశంలోని అత్యుత్తమ మత కేంద్రాలలో ఒకటని అన్నారు. మానవ త్వానికి, సాధ్యమైన అన్ని విధాలలో నిష్కళంకమైన సేవకు ఈ మఠం ప్రసిద్ధి చెందిందిఅని అన్నారు. వెయ్యి యాభై సంవత్సరాల కంటే ఎక్కువ ఫలవంతమైన తన ఉనికితో, దేశవ్యాప్తంగా మరియు విదేశాలలో వేలాది మంది ప్రజలకు సామాజిక- ఆధ్యాత్మిక-ఆరోగ్య మరియు విద్యా కేంద్రం గా శ్రీ సుత్తూర్ మఠం ఒక కేంద్రంగా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా శ్రీ సుత్తూరు వీరసింహాసన సంస్థాన మఠానికి చెందిన పవిత్ర జగద్గురు శ్రీ శివరాత్రి దేశికేంద్ర మహాస్వామిజీతో పాటుకృష్ణరాజ్ నియోజక వర్గం ఎంఎల్ఏ శ్రీ ఎస్.ఎ. రామదాస్, చామరాజ ఎంఎల్ఏ నియోజకవర్గానికి చెందిన శాసనసభ్యుడు శ్రీ నాగేంద్ర, నరసింహరాజ్ నియోజక వర్గం ఎంఎల్ఏ శ్రీ తన్వీర్ సైత్, మైసూర్ సిటీ కార్పొరేషన్ మేయర్ శ్రీమతి సునంద పలనేత్ర, మైసూర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ హేమంత కుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన స్పీకర్ పోచారం

కామారెడ్డి, ఆగష్టు 30:: జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శాసన సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. బీర్కూరు మండలం తిమ్మాపూర్ గ్రామంలో రూ.54 లక్షలతో నిర్మించే ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గధులకు, 30 డబుల్ బెడ్ రూం ఇండ్లకు, రూ. 20 లక్షలతో సిసీ రోడ్లు, డ్రైనేజీలు, రూ.5 లక్షలతో పద్మశాలీ సంఘం భవనం, రూ. 5 లక్షలతో బత్తిన సంఘం భవనాలకు స్పీకర్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా బీర్కూరు తండాలో నూతనంగా నిర్మించే 15 డబుల్ బెడ్ రూం ఇండ్లకు, రూ.5 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవనం ప్రహరీ గోడకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ?తెలంగాణ తిరుమల దేవస్థానం (ఖఆ) నెలకొన్న తిమ్మాపూర్ గ్రామం విశిష్టమైందన్నారు. ఆలయం విస్తరణ, భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి రూ. 23 కోట్లతో దేవస్థానం వద్ద అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు.

నియోజకవర్గంలో సొంత ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లును మంజూరు చేస్తామన్నారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ ద్వారా గోదావరి నీళ్లు ఇప్పటికే నిజాంసాగర్ ప్రాజెక్టు లోకి వస్తున్నాయి.

మల్లన్న సాగర్ జలాశయం నుంచి ప్రత్యేకంగా తవ్వే మరో కాలువ ద్వారా రోజుకు అర ఒక టీఎంసీ నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టు లోకి తీసుకురావడానికి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలోని నాన్ ఆయకట్టు పరిధి ప్రాంత భూములకు నీళ్లందించడానికి రూ. 36.50 కోట్లతో చందూరు, రూ.70 కోట్లతో జాకోర ఎత్తిపోతల పథకాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా 12,000 ఎకరాలకు పైగా సాగునీరు అందుతుంది.

మంజీరా నదిపై నియోజకవర్గ పరిధిలో నాలుగు చెక్ డ్యాంలను నిర్మిస్తున్నామని స్పీకర్ పోచారం తెలిపారు. దేశాన్ని ఎక్కువ కాలం నుంచి పరిపాలిస్తున్న పార్టీలు అభివృద్ధి చేయలేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి మాట్లాడాలి. అంతేకానీ అనవసరంగా విమర్శలు చేయొద్దని ప్రతిపక్షాలకు హితవు పలికారు.

బండి సంజయ్ కాలికి గాయం.. పాదయాత్రపై నో డౌట్స్

హైదరాబాద్ , ఆగష్టు 30:తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కుడి కాలికి గాయమైంది. ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా రాత్రి లంగర్ హౌస్ వద్ద ఉన్నప్పుడు గాయమైంది. గత రెండ్రోజులుగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నడవడంతో కుడికాలి బొటనవేలు చిట్లింది. దీంతో ఆయన నడిచేందుకు కొంచం ఇబ్బంది పడ్డారు. అయితే, డాక్టర్లు ఆయనకు వైద్యం చేశారు. కాలికి గాయం అయినా కూడా తన పాదయాత్రను యాధావిధిగా కొనసాగిస్తున్నారు. కాగా, బండి సంజయ్ పాదయాత్ర నేటితో మూడో రోజుకు చేరుకుంది. ఇవాళ మొత్తం 13 కీలో మీటర్ల మేర పాదయాత్ర చేయనున్నారు.

సిద్ధిపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

సిద్ధిపేట, ఆగష్టు 30:గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సిద్దిపేట జిల్లాలో వాగులు, చెరువులు ఉధ్ధుతంగా ప్రవహిస్తున్నాయి. కోహెడ మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. రికార్డు స్థాయిలో 138.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో, కోహెడ మండలంలోని మోయ తుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బస్వాపూర్ వంతెన పైనుండి మోయ తుమ్మెద వాగు ఉధ్ధుతంగా ప్రవహిస్తుండడంతో హనుమకొండ- సిద్ధిపేటకు రాకపోకలు స్తంభించాయి. ఎగువన ఉన్న నంగునూరు మండలంలో కూడా రికార్డు స్థాయిలో 146.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఎగువ నుండి వస్తున్న భారీ వరద నీటితో మోయ తుమ్మెద వాగు ఉగ్రరూపం దాల్చింది. కోహెడ మండలం లోని శనిగరం ప్రాజెక్ట్ నిండుకుండలా మరి ప్రమాదకరంగా మత్తడి పోస్తోంది. ప్రాజెక్టు ఎగువ నుండి మోయ తుమ్మెద వాగు ప్రవాహం ఉధృతంగా ప్రాజెక్టులో చేరుతుండడంతో ప్రాజెక్టు వద్ద మత్తడి ప్రమాదకరంగా పారుతోంది. ఈ నీటి ప్రవాహం కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్ లోకి ప్రవహిస్తోంది. శనిగరం ప్రాజెక్ట్ మత్తడి శిథిలావస్థలో ఉండడంతో నీటి ప్రవాహానికి మరింత శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోయ తుమ్మెద వాగు పరిసర ప్రాంతాల ప్రజలు, శనిగరం ప్రాజెక్టు మత్తడి ప్రవాహానికి పరిసర ప్రాంతంలో ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలియజేశారు. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న మత్తడి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు.

అజంజాహి మిల్స్ ప్రాంగణంలో వరంగల్ కలెక్టరేట్‌ను నిర్మిస్తాం

వరంగల్, ఆగష్టు 30: వరంగల్ నగరంలోని అజంజాహి మిల్స్ ప్రాంగణంలో వరంగల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. హన్మకొండలోని రోడ్లు భవనాల శాఖ గెస్ట్ హౌస్‌లో సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ హరిత, రెవెన్యూ అధికారులతో వరంగల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం భవన నిర్మాణానికి కావాల్సిన భూ సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

వరంగల్ రూరల్ జిల్లా స్థానంలో ఇటీవల వరంగల్ జిల్లా ఏర్పడి నందున జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణానికి కావాల్సిన భూమిని వెంటనే సేకరించాల్సిందిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారన్నారు. అందువల్ల వెంటనే సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణానికి కావాల్సిన భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి భవన నిర్మాణ నిమిత్తం ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి జిల్లా కలెక్టర్ను ఆదేశించారు.

భూసేకరణలో ఏమైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో మహేందర్ జీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వరద నీటిలో చిక్కుకున్న కారు.. ఇద్దర్ని కాపాడిన సిద్ధిపేట పోలీసులు

సిద్ధిపేట, ఆగష్టు 30: : సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా ఏడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మిట్టపల్లి బ్రిడ్జిపై వరద నీటిలో ఓ కారు చిక్కుకుపోయింది. సిద్ధిపేట నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కూడవెల్లి సంతోష్, మురాం భాను వరద నీటిలో చిక్కుకున్నట్లు సిద్ధిపేట త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తమ బృందంతో అక్కడికి చేరుకుని కారులో ఉన్న సంతోష్, భానును ప్రాణాలతో రక్షించారు. వీరిద్దరిని సిద్ధిపేట పట్టణంలోని శివాజీ నగర్‌కు చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. వరద ఎక్కువగా ఉండటంతో ఆ మార్గంలో పోలీసులు వాహనాలను నిలిపివేశారు.

గుజరాత్‌లోని అంకలేశ్వర్‌లో తయారు చేసిన కొవాక్సిన్ మొదటి కమర్షియల్ బ్యాచ్‌ను విడుదల చేసిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు, ఎరువుల శాఖల మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, ఆగష్టు 30:కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయన, ఎరువుల శాఖల మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవియా ఈ రోజు గుజరాత్‌లోని అంకలేశ్వర్‌లోని భారత్ బయోటెక్ చిరాన్ బెహ్రింగ్ వ్యాక్సిన్‌ల సౌకర్యం నుండి కోవాక్సిన్ మొదటి కమర్షియల్ బ్యాచ్‌ను విడుదల చేశారు. నవసారి ఎంపి శ్రీ సి ఆర్ పాటిల్, అంకలేశ్వర్ ఎమ్మెల్యే శ్రీ ఈశ్వర్సింహ్ పటేల్, ఎమ్మెల్యే దుష్యంత్ పటేల్, భారత్ బయోటెక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ఎల్ల ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

గౌరవనీయులైన ప్రధాన మంత్రి దార్శనికత వల్ల భారతదేశం మొట్టమొదటి స్వదేశీ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయగలిగిందని శ్రీ మన్సుఖ్ మాండవ్య అన్నారు. భారత దేశం, ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సినేషన్ ప్రోగ్రామ్‌లలో ఒకటిగా నడుస్తోందని, ఈ స్వదేశీ వ్యాక్సిన్‌ల అభివృద్ధి కారణంగా ఇది సాధ్యమైందని ఆయన వ్యాఖ్యానించారు. జాతీయ కోవిడ్ -19 టీకా కార్యక్రమం 16 జనవరి 2021 నుండి అన్ని రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో విజయవంతంగా కొనసాగుతోందని ఆయన తెలిపారు. అంకలేశ్వర్ సౌకర్యాల నుండి దేశానికి మొదటి బ్యాచ్ కోవాక్సిన్ అంకితం కేంద్ర ఆరోగ్య మంత్రి అంకితం చేశారు. కోవిడ్ -19 పై భారత పోరాట ప్రయాణంలో ఇది ఒక మైలురాయి అని అన్నారు. కోవిడ్ -19 వ్యాక్సిన్‌ల ఉత్పత్తి సామర్థ్యం పెరగడం వల్ల భారతదేశంలో టీకాల వేగానికి మరింత ఊపునిస్తుంది.

భారత్ బయోటెక్, జైడస్ కాడిలా అనే రెండు కంపెనీల టీకాల పరిశోధన, ఉత్పత్తి భారతదేశంలో జరగడం మనకు గర్వకారణమని ఆయన అన్నారు. ఈరోజు నుండి నెలకు ఒక కోటి కంటే ఎక్కువ వోతాదుల ఉత్పాదక సామర్థ్యాన్ని అంకలేశ్వర్ ప్లాంట్ కలిగి ఉంటుందని ఆయన తెలియజేశారు. ప్రపంచ మహమ్మారికి వ్యతిరేకంగా పోరాటంలో భారత దేశ సహకారం గురించి మాట్లాడుతూ, కోవిడ్ పరిస్థితిని ఎదుర్కోవటా నికి అవసరమైన ఔషధాలను ఇతర దేశాల కు సహాయం చేయడంలో భారతదేశం ఎల్లప్పుడూ ముందంజలో ఉందని పేర్కొన్నారు.భారతదేశంలో కోవాక్సిన్ ఉత్పత్తి స్థితి గురించి మాట్లాడుతూ, హైదరాబాద్, మలూర్, బెంగళూరు, పూణే క్యాంపస్‌లలో భారత్ బయోటెక్ ఇప్పటికే అనేక ఉత్పత్తి మార్గాలను ఏర్పాటు చేసిందని అన్నారు. చిరోన్ బెహ్రింగ్, అంకలేశ్వర్ దాని కొవాక్సిన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని కేంద్ర మంత్రి తెలియజేశారు. .

2020 సమయంలో నిర్మించిన కొత్త ఫిలింగ్ సౌకర్యం ఇప్పుడు కోవాక్సిన్ ఉత్పత్తికి ఉపయోగించపడుతోంది. కొవాక్సిన్ ఉత్పత్తి జూన్ లో ప్రారంభమైంది, దీనికి ముందు బృందం ఫెసిలిటీలో పరికరాల పనితీరును అధ్యయనం చేయడానికి ఇంజనీరింగ్ బ్యాచ్‌లను అమలు చేసింది. అంకలేశ్వర్ సదుపాయాల నుంచి తయారు చేసిన ఉత్పత్తులు సెప్టెంబర్ 2021 నుండి సరఫరా కోసం అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు..

భారత్ బయోటెక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ఎల్లా మాట్లాడుతూ, "ప్రపంచ భద్రత, సమర్థత ప్రమాణాలతో వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయాలనే మా లక్ష్యం ఇప్పుడు నెరవేరింది, మేము ఇప్పుడు వార్షిక సామర్థ్యం 1.0 బిలియన్ డోస్‌ల లక్ష్యం వైపు కదులుతున్నాము." అని అన్నారు.

భారత్ బయోటెక్ ఇతర దేశాలలో తన భాగస్వాములతో తయారీ భాగస్వామ్యాన్ని కూడా అన్వేషిస్తోంది, మరింత బలోపేతం కోసం జీవ భద్రత నియంత్రణలో క్రియారహిత వైరల్ వ్యాక్సిన్‌ల వాణిజ్య-స్థాయి తయారీలో ముందస్తు నైపుణ్యాన్ని కలిగి ఉంది.

సీఎం కేసీఆర్ పాలన.. దేశానికే రోల్ మోడల్

సూర్యాపేట, ఆగష్టు 30: : సీఎం కేసీఆర్ పాలన దేశానికి రోల్ మోడల్ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సూర్యాపేట నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ, ప్రభుత్వం వేర్వేరు కాదని.. పార్టీ నిర్ణయమే ప్రభుత్వం అమలు పరుస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ టీఆర్ఎస్ రూపొందించినవేనన్నారు. గులాబీ జెండాయే తెలంగాణకు రక్ష అన్నారు. ఎన్నికల్లో మేనిఫెస్టోను రూపొందించేది పార్టీయేనని, అధికారంలోకి వచ్చాకా అదే మేనిఫెస్టోను ప్రభుత్వం అమలుపరుస్తుందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం రైతుబంధు, బీమా పథకాలు, ఆసరా పథకం కింద పింఛన్లు అందజేస్తుందన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకాలు ఉన్నాయా? అంటూ ప్రశ్నించారు. మిషన్ భగీరథ పథకం ఆయా పార్టీల ఏలుబడిలో రాష్ట్రాల్లో ఎందుకు లేదని ప్రశ్నించారు. 2014కు పూర్వం తెలుగు రాష్ట్రాల్లో ఉన్నాయా? అన్నారు. సీఎం కేసీఆర్‌కు ఉన్న ధైర్యం ఎవరికి ఉందని, బ్రోకర్లు, లోఫర్లు, జోకర్లు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యకర్తలు ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సెప్టెంబర్ 2న జెండా పండుగను విజయవంతం చేయాలన్నారు.

సిరిసిల్ల శ్రీ సిరి హాస్పిటల్ డాక్టర్ శోభారాణి అవార్డుతోపాటు సత్కారం

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 30:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీ సిరిసిల్ల హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి చేసిన సామాజిక సేవలను గుర్తించి హైదరాబాద్ చిక్కడపల్లిలో లహరి క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాజ గాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని శ్రీ సిరి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి అవార్డుల కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించి శోభారాణి చేసిన సామాజిక సేవలను గుర్తించి సేవ ప్ర పూర్ణ అవార్డుతోపాటు ఘనంగా సత్కరించారు.

తెలంగాణలోని పలువురు ఉత్తమ సామాజిక సేవకలను,కళాకారులను రచయితలనుసన్మానించారు. శోభారాణి మాట్లాడుతూ తనకు జరిగిన సత్కారం తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు .

అవార్డు పట్ల జిల్లాలోని పలు ప్రైవేట్ హాస్పిటల్ లోని డాక్టర్లు అభినందించారు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాస్కుల పంపిణీ

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 30:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో వేములవాడ లయన్స్ క్లబ్ వారు లయన్ సా మ వీర రమణయ్య జన్మదిన సందర్భంగా చం దుర్తి మండలం మల్యాల, మూడపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. ప్రాథమిక పాం శాలలు. అంగన్ వాడి కేంద్రాల కు.గోస్కులపల్లి ప్రాథమిక పాఠశాలకు మాస్కులు. శానిటేజర్ల ను పంపిణీ చేశారు.సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యం లో విద్యార్థిని విద్యార్థులకు కరోనా సోకకుండా ముందస్తుగా మాస్కుల. శానిటైయిజర్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలుక అంజిబాబు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు రా పెల్లి శ్రీధర్ , కోశాధికారి .రాజశేఖర్ కార్యవర్గ సభ్యులు వీరరమనయ్య. ఉపసర్పంచ్ పుల్కం రవి. వార్డు సభ్యులు నేతికుంట అనిల్ బత్తుల.వినోద విద్యా కమిటీ ఛైర్మెన్ రాచర్ల మోహన్ ప్రధాన ఉపాధ్యాయులు ప్రతాపనవీన్ బాబు. పుప్పాలశ్రీనివాస్. పర్శరాములు. సంజీవ్ అంగన్ వాడి ఉపాధ్యాయులు బత్తులరాధిక.పంబపద్మ తదితరులు పాల్గొన్నారు,

ఓయూలో స్పోర్ట్స్ క్లస్టర్‌కు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ , ఆగష్టు 30:ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలో క్రీడల్లో ఆసక్తి ఉన్న యువతీ యువకులకు మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఖేలో ఇండియా పథకం ద్వారా ఎంతో మంది క్రీడాకారులకు కేంద్రప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. దీంతో ఒలింపిక్స్??లో మన దేశ క్రీడాకారులు సత్తా చాటారని అభిప్రాయ పడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్మించతలపెట్టిన స్పోర్ట్స్‌క్లస్టర్‌కు ఆదివారం శంకుస్థాపన చేశారు. కేంద్రప్రభుత్వ ఖేలో ఇండియా పథకం కింద రూ. 13.5 కోట్లు ఓయూకు మంజూరయ్యాయి. ఈ క్లస్టర్‌లో భాగంగా సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్టులు, మహిళలకు ప్రత్యేక స్విమ్మింగ్‌పూల్‌లను నిర్మించనున్నారు.

క్యాంపస్ లోని నీ గ్రౌండ్‌లో నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.26 కోట్లు కేటాయించిందని చెప్పారు. కేవలం ఉస్మానియా యూనివర్సిటీకే 13.5 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి రోజూ ఏదో ఒక క్రీడ ఆడుతూ ఉండాలని పిలుపునిచ్చారు. నగరంలో అనేక కారణాల వలన క్రీడలకు సంబంధించిన స్థలాలు తక్కువగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లోనూ స్పోర్ట్స్ కాంప్లెక్స్??లు మరిన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కాంప్లెక్స్??ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓయూ అభివృద్ధికి తన వంతు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత క్రీడలు, క్రీడాకారులకు మంచి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చారని గుర్తు చేశారు.

ఇండియన్ స్పోర్ట్స్‌కు ఇది స్పెషల్ మూమెంట్: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 30: టోక్యోలో జరుగుతున్న పారాలింపిక్స్ షూటింగ్‌లో గోల్డ్ మెడల్ గెలిచి చరిత్ర సృష్టించిన అవని లెఖారా(ఎలజీనితి ఒవఎష్టజీతీజీ)పై ప్రశంసలు కురిపించారు ప్రధాని నరేంద్ర మోదీ. పారాలింపిక్స్‌లో గోల్డ్ గెలిచిన తొలి భారతీయ మహిళగా అవని రికార్డు క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. అంతేకాదు ఫైనల్లో ప్రపంచ రికార్డును ఈక్వల్ చేస్తూ 249.6 పాయింట్లతో ఆమె టాప్‌లో నిలిచింది. మొత్తంగా పారాలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన నాలుగో ఇండియన్ అవని. గతంలో 1972లో స్విమ్మర్ మురళీకాంత్, 2004, 2016లలో జావెలిన్ త్రోయర్ దేవేంద్ర ఝూఝూరియా, 2016లో హైజంపర్ తంగవేలు మరియప్పన్ గోల్డ్ మెడల్స్ సాధించారు.

అవని సాధించిన ఈ అరుదైన ఘనతపై మోదీ సోమవారం ఉదయం ట్వీట్ చేశారు. అద్భుతమైన ప్రదర్శన. ఎంతో కష్టపడి గోల్డ్ మెడల్ సాధించినందుకు శుభాకాంక్షలు. ఇది షూటింగ్ పట్ల నీకు ఉన్న అంకితభావం వల్లే సాధ్యమైంది. ఇండియన్ స్పోర్ట్స్‌కు ఇదో ప్రత్యేక సందర్భం అని మోదీ ట్వీట్ చేశారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ మినిస్టర్ అనురాగ్ ఠాకూర్, పారాలింపియన్ దీపా మాలిక్ కూడా అవనిపై ప్రశంసలు కురిపించారు.

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలంతా చాలా అప్రమత్తంగా ఉండాలి

-భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా పోలీసులు యంత్రాంగం అలర్ట్-జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 30:(నేటినిజం ప్రతినిధి): జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే 24 గంటల్లో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిక దృష్టిలో ఉంచుకుని,జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల నీటి ప్రవాహం గురించి అన్ని జాగ్రత్త చర్యలు తీసుకొని ప్రత్యక్షంగా వెళ్లి పర్యవేక్షించాలని, మరియు సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు...

జిల్లాలో ఎక్కడైనా వరద ఉధృతో రోడ్లు తెగిపోయిన, ఉధృతంగా ప్రవహించేనా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లవద్దని, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్, త్రెడ్ మరే ఇతర పరికరాలు అడ్డంపెట్టి సంబంధిత గ్రామల గ్రామాల సర్పంచులకు ప్రజలకు తెలియజేయాలనిసూచించారు.పట్టణాలలో గ్రామాలలో మట్టితో కట్టిన పురాతన ఇండ్ల గురించి సమాచారం తెలుసుకుని, ఇండ్లు కూలే ప్రమాదంలో ఉంటే సంబంధిత మున్సిపల్, రెవెన్యూ అధికారుల సహకారంతో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.వరత ఉధృతి ఎక్కువ ఉన్న ప్రదేశాలలో ప్రాణనష్టం జరగకుండా ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని సూచించారు.ఎగువ మానేరు జాలశయ నీటి మట్టం పూర్తి స్థాయిలో నిండి మత్తడి దుంకుతుందని, జలాశయం వద్దకు ఎవరికీ అనుమతి లేదని ఎస్పీ రాహుల్ హెగ్డే స్పష్టం చేశారుఎవరూ కూడా నీటి ప్రవాహాలు దగ్గరికి ఫోటోలు, సెల్ఫీల కోసం వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని హెచ్చరించారు..

ప్రజలు పోలీసుల సూచనలు సలహాలు పాటించి వాగులు మరియు రోడ్లు, బ్రిడ్జి పై నుండి వెళుతున్న నీటి ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు..

ప్రజలు ఈ పరిస్థితులలో పోలీస్ శాఖతోసహకరించాలని భారీ వరదలు, వర్షాల క్రమంలో జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి అని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే కోరారు..ఏమైనా సంఘటనలు జరిగితే సంబంధిత పోలీసులకు కానీ డయల్ 100 సమాచారం అందించినచొ తక్షణ సహాయక రక్షణ చర్యలు చేపడుతామని జిల్లా ఎస్పీ తెలిపారు..

గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మురా గోపాల్

హైదరాబాద్ , ఆగష్టు 30:రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్ అప్రతిహతంగా కొనసాగుతున్నది. సెలబ్రెటీల నుంచి సాధరణ జనం వరకు ఇందులో పాలుపంచుకుంటున్నారు. తాజాగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటడం సంతోషాన్నిచ్చిందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని రక్షించడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ చాలా విజయవంతంగా కొనసాగుతుందని, ఇంత మంచి కార్యక్రమం చేపట్టిన ఎంపీ సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పారాలింపిక్స్‌లో భారత్‌కు మరో స్వర్ణం



టోక్యో, ఆగష్టు 30:: జపాన్ రాజధాని టోక్యోలో జరుగుతున్న పారాలింపిక్స్‌లో భారత్‌కు పతకాల పంట పండుతున్నది. ఇప్పటికే షూటింగ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో అవని లెఖారా స్వర్ణం సాధించగా.. ఇప్పుడు జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ మరో స్వర్ణాన్ని భారత్ ఖాతాలో చేర్చాడు. సుమిత్ అంటిల్ అత్యధికంగా 68.55 మీటర్ల దూరం తన ఈటెను విసిరి తొలి స్థానంలో నిలిచాడు. ఇదే పోటీలో ఉన్న మరో భారతీయుడు సందీప్ కూడా అత్యధికంగా 62.20 మీటర్ల దూరం ఈటెను విసిరి తృతీలో కాంస్య పతకాన్ని చేజార్చుకున్నాడు.

సుమిత్ అంటిల్ సాధించిన గోల్డ్ మెడల్‌తో కలిపి పారాలింపిక్స్‌లో భారత్ ఇప్పటివరకు రెండు బంగారు పతకాలు సాధించినట్లయ్యింది. ఈ ఉదయం షూటర్ అవని లెఖారా కూడా గోల్డ్ మెడల్ తన ఖాతాలో వేసుకుంది.

ప్రోసస్ సోషల్ ఇంపాక్ట్ ఛాలెంజ్ 2021లో దేశంలో వినూత్నమైన అసిస్టెంట్ టెక్ స్టార్టప్‌ల కోసం అన్వేషణ

హైదరాబాద్ , ఆగష్టు 30:భారత దేశంలోని ప్రతి ప్రాంతంలోని స్టార్టప్‌ల నుండి దరఖాస్తులను ఆకర్షించడం ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం ప్రోసస్ సంస్థ మూడు సంవత్సరాలలో ఎబెఖీ 16,500 ,000 ఈ కార్యక్రమం కోసం ఉపయోగించడానికి కట్టుబడివుందిఅర్హత ఉన్న స్టార్టప్‌లు ఈ రోజునుంచి అక్టోబర్ 19 వరకు తమ దరఖాస్తులను సమర్పించవచ్చు ఈ సంవత్సరం ప్రోసస్ సికా 2021 ప్రారంభంతో భారతదేశపు అత్యంత వినూత్నమైన అసిస్టెంట్ టెక్నాలజీ స్టార్టప్‌ల కోసం ఈ సంవత్సరం అన్వేషణ జరుగుతోంది. ప్రోసస్ ద్వారా గత సంవత్సరం సృష్టించబడింది – ఇన్వెస్ట్ ఇండియా, సోషల్ ఆల్ఫా ప్రపంచ ఆరోగ్య సంస్థ భాగస్వామ్యంతో – ఈ చొరవ వార్షిక గ్రాంట్ మరియు ప్రోసస్ ఎస్ఐసిఏ మెంటార్ షిప్ ప్రోగ్రామ్‌కి ప్రాప్యత కోసం సహాయక సాంకేతిక రంగంలో అత్యంత ఆశాజనకమైన పరిష్కారాలతో భారతీయ స్టార్టప్‌లను ఆహ్వానిస్తుంది. 70 మిలియన్లకు పైగా భారతీయులు ఏదో ఒక వైకల్యంతో జీవిస్తారని అంచనా వేయబడింది.సహాయక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా జీవితాలను మెరుగుపరచడం ప్రజలను శక్తివంతం చేయడం ద్వారా సామాజిక ప్రభావం అపారంగా ఉంటుంది. అస్సిస్‌టెక్ ఫౌండేషన్ ఈ నెల ప్రారంభంలో ప్రోసస్ " సిఎస్ఆర్ ఇనిషియేటివ్ ఆఫ్ ది ఇయర్" గా గుర్తించింది.ప్రోసస్ సంస్థ మూడు సంవత్సరాలుగా ఈ చొరవకు 16,500, 000 నిశ్చయించింది, ప్రతి సంవత్సరం మూడు విజయవంతమైన స్టార్టప్‌లకు అవార్డులు మంజూరు చేస్తుంది. ఇన్వెస్ట్ ఇండియా సోషల్ ఆల్ఫాతో సహా భాగస్వాములు అదనపు మెంటరింగ్, ఫైనాన్సింగ్ అవకాశాలను అందిస్తారు, అయితే చిఐఖా ఈ కార్యక్రమానికి సాంకేతిక సహాయంతో మద్దతు ఇస్తుంది. 2020 లో దాని ప్రారంభ ఎడిషన్‌లో, ప్రోసస్ ౫ఎఅం భారతదేశవ్యాప్తంగా 25 రాష్ట్రాలు, ఏడు కేంద్రపాలిత ప్రాంతాల నుండి 200 కి పైగా దరఖాస్తులను స్వీకరించింది. సోహుమ్ ఇన్నోవేషన్ ల్యాబ్ (బెంగళూరు), నియోమోషన్ (చెన్నై) మరియు స్టామారి (న్యూఢిల్లీ) సహాయక సాంకేతిక పరిజ్ఞానాలలో చాతుర్యం ప్రభావానికి గుర్తింపు పొందిన మొదటి మూడు స్టార్టప్‌లు.అగ్రశ్రేణి స్టార్టప్‌లతో పాటు, మరో ఇద్దరు ఫైనలిస్టులు ౫ఎఅం మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌లో చేరారు, ప్రోసస్ అనుభవం నుండి పారిశ్రామికవేత్తలకు మద్దతు ఇవ్వడం విజయం సాధించడంలో వారికి సహాయపడటం: కాగ్నిబుల్ (ఢిల్లీ) థింకర్‌బెల్ సొల్యూషన్స్ (ఢిల్లీ). ప్రోసస్ ౫ఎఅం 2021 కోసం, వికలాంగుల జీవితాలను సానుకూలంగా ప్రభావితం చేసే అత్యంత శక్తివంతమైన వినూత్న స్టార్టప్‌లను గుర్తించడానికి నిఎణులైన న్యాయమూర్తుల బృందం సమావేశమవుతుంది .. అర్హత కలిగిన స్టార్టప్‌లు ఇప్పటి నుండి అక్టోబర్ 19 వరకు తమ దరఖాస్తులను సమర్పించవచ్చు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టాప్ స్టార్టప్‌లను డిసెంబర్‌లో ప్రకటించనున్నారు. ఈ కార్యక్రమం పై స్పందిస్తూ ప్రోసస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సెహ్రోజ్ సింగ్ ఇలా అన్నారు: "ప్రజల రోజువారీ జీవితాలను మెరుగుపరచడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలను ఎనేబుల్ చేయడం ప్రోసస్‌లో మా లక్ష్యం. ఇక్కడ భారతదేశంలో, ఒక శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ ఉన్నప్పటికీ కొంత వైకల్యంతో జీవిస్తున్న 70 మిలియన్ల వ్యక్తుల అవసరాలు తక్కువగా ఉన్నాయి. సహాయక టెక్నాలజీల కోసం అభివృద్ధి చెందుతున్న మార్కెట్ ఉంటుందని మేము నమ్ముతున్నాము మా ప్రారంభ ప్రోసస్ ౫ఎఅం చొరవకు గత సంవత్సరం అద్భుతమైన స్పందన ఈ నమ్మకాన్ని ధృవీ కరించింది. ఈ సంవ త్సరం ప్రయాణాన్ని కొనసాగించడం మాకు చాలా గర్వంగా ఉంది. ప్రోసస్ ౫ఎఅం 2021 లో ప్రవేశించడం ద్వారా మా మిషన్‌లో చేరడానికి సహాయక సాంకేతిక రంగంలో ఉన్న పారిశ్రామికవేత్తలందరినీ నేను ప్రోత్సహిస్తున్నాను.

తడి, పొడి చెత్త పై అవగాహన

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 30:(నేటినిజం ప్రతినిధి): రుద్రవరం గ్రామం లో సోమవారం సర్పంచ్ ఊరడి రాంరెడ్డి అధ్యక్షతన స్వచ్ఛభారత్ ఐ ఈ సి కన్సల్టెంట్ కె. సురేష్ ఆధ్వర్యంలో తడి చెత్త, పొడి చెత్త మరియుహానికరమైన చెత్త ను ఏవిదంగా వేరు చేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ కు ఇవ్వాలని మరియు ఇంటి లో నిండిన సెప్టిక్ ట్యాన్కు లోని మలాన్ని సెప్టిక్ ట్యాంకర్ వారు తీసుకువెళ్లి మున్సిపల్ రిసోర్స్ పార్క్ లో నిర్మించిన ఎఫ్ ఎస్ ఎమ్ వారు కు ఇచ్చి దాని ద్వారా ఎరువును తయారు చేసే విధానం గురించి అవగాహనా కల్పించడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో ఎంపీటీసీ గాలి పెల్లి సువర్ణ స్వామిగౌడ్ఉప సర్పంచ్ తా డం శ్రీనివాస్ , ఏఎంసీ వైస్ వైస్ చైర్మన్ ఉరిడీ ప్రవీణ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ లు,మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తం గా వుండండి

-వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 30:(నేటినిజం ప్రతినిధి): గత రెండు రోజుల నుండి వర్షాలు కురవటం రానున్న రెండు మూడు రోజులు కూడా వర్షాలు ఉండటం తో ప్రజలు అప్రమత్తం గా ఉండాలి అని పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు.ఇప్పటికే వాగుల లో ప్రవాహం ప్రారంభం అయింది కాబట్టి ప్రజలు తగు జాగ్రత్త లు తీసుకోవాలి, ఈ వర్షాలకు ప్రజలు బయటకు వెళ్లకపోవటమే మంచిది.

పట్టణ పరిధిలోని చిన్న చిన్న వాగులు లో కూడా వరద వెళుతుంది కాబట్టి ప్రజలు అప్రమత్తం గా వుండండి. పాత ఇల్లు, మట్టి గోడలు ఈ వర్షాలకు కూలిపోయే ప్రమాదం వుంది కాబట్టి జాగ్రత్త వహించగలరు.అదే విధంగా ఇంట్లో కరెంటు బోర్డు సక్రమంగా ఉంచుకోవాలి, తడి కాళ్లు చేతులతో కరెంటు స్విచ్చులు వేయకుండా ఉంటే మంచిది.. లేకుంటే షాక్ కొట్టే ప్రమాదం ఉంటుంది. రోడ్ల వెంట ఉన్న ఇనప కరెంటు స్తం భాల వద్దకు వెళ్లకుండా ఉంటే మంచిది. ఇంటి ముందున్న చెట్లు కరెంటు తీగ లతో అల్లక పోవటం వల్ల ఈ వర్షానికి చెట్లకు కూడా కరెంటు వచ్చే అవకాశం ఉంటుంది అప్రమత్తంగా ఉండాలి.రైతులు వ్యవసాయ మోటార్లు వద్ద అప్రమత్తంగా ఉండాలి. చేపలు పట్టుటకు వెళ్ళారాదు.మోటార్ వాహనాలు తో నిదానంగా ప్రయాణం చేయాలి సడన్ బ్రేక్ వేస్తే జారిపడే అవకాశం ఉంటుంది.ముఖ్యం గా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తం గా ఉండాలి.

బురదమయమైన వేములవాడ రాజన్న ఆలయ ప్రాంతం

-రాజన్నను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు తీవ్ర ఇబ్బందులు

-పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు